





తిరుపతి నెహ్రూ హైస్కూల్ మైదానంలో ఎగురవేస్తున్న పతంగులు - కోళ్ల పందేల్లో నాయకులు - తిరుచానూరు శిల్పారామంలో భోగిమంటలు

సంక్రాంతి సందడి

సంక్రాంతి సందడి శనివారమే ప్రారంభమైంది. తిరుపతిలో వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో పిల్లలూపెద్దలు పతంగులు ఎగుర వేశారు. కోడి పందేలు, బొంగరాలు, గోలీలు, కర్రసాము వంటి పల్లె ఆటల్లో ఓలలాడారు.తిరుచానూరు సమీపం లోని శిల్పారామంతో పాటు పలు ప్రాంతాల్లో శనివారం సాయంత్రమే భోగిమంటలు వేసి సరదాగా గడిపారు.పండుగ సామాగ్రి కొనుగోళ్లతో బజార్లన్నీ కిక్కిరిసాయి.



తిరుపతిలో పండుగ సామాగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన గాంధీరోడ్డు



తిరుపతిలోని దీక్షా శిబిరం వద్ద ఎస్మా ప్రతుల దహనం

భోగి మంటల్లో ఎస్మా ప్రతుల దహనం

పలుచోట్ల అంగన్వాడీ కార్యకర్తల నిరసన

తిరుపతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సమ్మె విరమించమంటూ బెదిరించడమే కాకుండా ఎస్మా చట్టం ప్రయోగించడంపై అంగన్వాడీలు మండిపడ్డారు.శనివారం జిల్లాలో పలుచోట్ల భోగిమంటలు వేసి ప్రభుత్వ ప్రతులను దహనం చేశారు. తిరుపతిలోని దీక్షా శిబిరంలో సంక్రాంతి ముగ్గులను వేసి, ముగ్గుల మధ్యలో భోగిని పేర్చి నిప్పుపెట్టారు. అందులో ఎస్మా ప్రతులను వేసి దహనం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ అంగన్వాడీల సహనానికి జగన్ రెడ్డి పరీక్ష పెడుతున్నారని, చర్చల పేరుతో పిలిచి సమస్యలను పరిష్కరించకుండా అవమానిస్తున్నారని మండిపడ్డారు. అంగన్వాడీ కేంద్రాల పరిధిలో కోటి సంతకాల సేకరణ చేపట్టనున్నామని, రాబోయే రోజుల్లో ప్రత్యక్ష పోరాటాల్లోకి దిగుతామని హెచ్చరించారు. సీఐటీయూ నాయకులు సుబ్రమణ్యం, వేణుగోపాల్, ఆర్టీసీ కార్మిక నాయకులు కుమార్, సత్యనారాయణ తదితరులు అంగన్వాడీలకు మద్దతుగా నిలిచారు. శ్రీకాళహస్తి, గూడూరు, కోట, వెంకటగిరి, నాయుడుపేట, సూళ్లూరుపేట, పిచ్చాటూరు, సత్యవేడుల్లో దీక్షాశిబిరాల వద్ద భోగిమంటల్లో ఎస్మా ప్రతులు దగ్ధం చేసి, గొబ్బి పాటలు పాడుతూ అంగన్వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. పుత్తూరులో సమ్మె 33వ రోజుకు చేరుకోవడంతో 33 ఆకారంలో కూర్చుని నిరసన తెలిపారు.

నేడు స్వగ్రామానికి చంద్రబాబు, లోకేష్

చంద్రగిరి, జనవరి 13 : టీడీపీ జాతీయ అధ్యక్షుడు, చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్ ఆదివారం స్వగ్రామమైన నారావారిపల్లెకు రానున్నారు.ప్రతి ఏడాదిలాగే రెండురోజులు ఇక్కడే వుండి సంక్రాంతి పండుగను సంప్రదాయబద్ధంగా జరుపుకోనున్నారు. శుక్రవారమే చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి, ఆమె సోదరి లోకేశ్వరి, బంధువులు కంఠమనేని శ్రీనివాస్, శ్రీనివాస్ తదితరులు నారావారిపల్లెకు చేరుకోగా శనివారం చంద్రబాబు మనవడు నారా దేవాన్ష్, సినీనటుడు నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, సోదరుడు నందమూరి రామకృష్ణ, చిన్న కుమార్తె తేజస్విని, నారా రామ్మూర్తి నాయుడి సతీమణి ఇందిర శనివారం మధ్యాహ్నం నారావారిపల్లెకు చేరుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఉండవల్లి నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 12.30 గంటలకు ఎ.రంగంపేటలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో చంద్రబాబు దిగుతారు. అక్కడినుంచి స్వగృహానికి చేరుకొంటాడు. సాయంత్రం లోకేష్, ఆయన సతీమణి బ్రాహ్మణిలు రానున్నారు. సోమవారం ఉదయం సినీనటుడు నారా రోహిత్ రానున్నారు.సంక్రాంతి పండుగకు ప్రముఖులు రానుండడంతో గ్రామంలో ఏర్పాట్లు శరవేగంగా జరుగుతున్నాయి.చంద్రబాబుకు స్వాగతం పలుకుతూ టీడీపీ నాయకులు భారీ ఎత్తున ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఆదివారం క్రీడాపోటీలు,ముగ్గుల పోటీలు నిర్వహించడానికి మైదానాన్ని సిద్ధం చేశారు.చంద్రబాబు తల్లిదండ్రుల సమాధుల వద్ద, కులదైవం నాగాలమ్మ ఆలయం వద్ద, గ్రామ దేవత దొడ్డి గంగమ్మ ఆలయం వద్ద పూజలకోసం పరిసరాలను శుభ్రం చేశారు.

ఎన్నికల బదిలీల కసరత్తు దాదాపు పూర్తి

పొరుగు జిల్లాలకు వెళ్లనున్న 60 మంది ఎంపీడీవోలు, 22 మంది తహసీల్దార్లు

రాష్ట్ర కార్యాలయాలకు వెళ్లిన జాబితాలు

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 13: సాధారణ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఈ ప్రక్రియతో ప్రమేయమున్న అధికారుల బదిలీలకు సంబంధించిన కసరత్తు 95శాతం పూర్తయింది. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు మూడేళ్ల సర్వీసు పూర్తిచేసుకున్న జిల్లా, మండల అధికారులతోపాటు సొంత జిల్లాల్లో విధులు నిర్వహిస్తున్న వారిని బదిలీ చేయనున్నారు.ఎంపీడీవోలకు సంబంధించి ఉమ్మడి జిల్లా ప్రాతిపదికన జడ్పీ కార్యాలయంలో, తహసీల్దార్లకు సంబంధించి కొత్త జిల్లాల ప్రాతిపదికన కలెక్టరేట్‌లో కసరత్తు పూర్తిచేసి జాబితాలను రాష్ట్ర కార్యాలయాలకు నివేదించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని 65మంది ఎంపీడీవోల్లో ఫిబ్రవరి నుంచి జూన్ నెలాఖరులోగా ఐదుగురు ఉద్యోగ విరమణ చేయనున్నారు.అందుకని వీరికి బదిలీల నుంచి మినహాయింపు లభించనుంది. మిగిలిన 60మంది ఎంపీడీవోలు ఎన్నికల సంఘం నిబంధనలను అనుసరించి పొరుగు జిల్లాలకు వెళ్లనున్నారు. ఈ వివరాలను రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనరేట్‌కు పంపినట్లు తెలిసింది.

విశాఖ చేరిన ఇండిగో ప్రయాణికులు

రేణిగుంట, జనవరి 13: తిరుపతి విమానాశ్రయంలో శుక్రవారం సాయంత్రం విమానం రద్దు కావడంతో ఆందోళన చెందిన విశాఖ ప్రయాణికులకు శనివారం ఉద యం ఇండిగో యాజమాన్యం ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసింది.శుక్రవారం తిరుమల శ్రీవారి దర్శనం ముగించుకున్న విశాఖపట్నం ప్రాంతానికి చెందిన 26 మంది ప్రయాణికులు సాయంత్రం తిరిగి వెళ్లేందుకు తిరుపతి విమానాశ్రయం చేరుకున్నారు.అయితే గంటలకొద్దీ వేచివున్నాక ఇండిగో యాజమాన్యం విమాన సర్వీసు రద్దు చేయడంతో వారు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొన్నారు. తమకు వెంటనే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆందోళనకు దిగారు.చివరకు శనివారం ఉదయం 9.50 గంటలకు ఇండిగో యాజమాన్యం విమానం ఏర్పాటు చేసి వారిని విశాఖ పంపింది.

చిరుత దాడిలో లేగదూడల హతం

ఐరాల, జనవరి 13: ఐరాలకు కూతవేటు దూరంలోని నగరిలో శనివారం వేకువ జామున రెండు లేగ దూడలను చిరుత పులి చంపేసింది. ఈడిగపల్లెకు చెందిన రెడ్డెప్ప తన పశువులను శుక్రవారం రాత్రి నగరిలోని తన మామిడి తోటలో కట్టేశాడు.శనివారం వేకువ జామున తోటలోకి చొరబడ్డ చిరుతపులి రెండు లేగ దూడలను చంపేసింది.ఇటీవల నగరికి సమీపంలోని తోకబండ వద్ద ఓ ఆవును చిరుత చంపేసిన విషయం తెలిసిందే.

ఏపీలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది

- తిరుపతి నుంచి చిరంజీవి పోటీ చేయాలి
- కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్



మీడియాతో మాట్లాడుతున్న చింతామోహన్

తిరుపతి (తిలక్ రోడ్), జనవరి 13 : రాష్ట్రంలో రాజకీయ పరిణామాలు వేగంగా మారుతున్నాయని, ప్రజలందరూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నారని కేంద్ర మాజీ మంత్రి చింతామోహన్ పేర్కొన్నారు. నటుడు చిరంజీవి కాంగ్రెస్ అభ్యర్థిగా తిరుపతి నుంచి అసెంబ్లీకి పోటీచేస్తే సీఎం కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కాపులు ముఖ్యమంత్రి అయ్యే సముచిత సమయం ఇదేనని అన్నారు. కాపులను ముఖ్యమంత్రి చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీ తీసుకుంటుందన్నారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 130 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపొందుతుందని ధీమా వ్యక్తం చేశారు. నిరుపేద వర్గాల్లో, మైనార్టీల్లో 1978లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావాలని కనిపించిన ఆశ నేడు ఇక్కడ కనిపిస్తోందన్నారు. ఇండియా కూటమిలో భాగస్వాములైన కమ్యూనిస్టు పార్టీలకు చెందిన వారు బరిలో నిలబడాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. కాకినాడ లోక్‌సభ నుంచి సీపీఎం జాతీయ నాయకుడు సీతారాం ఏచూరి, నగరి అసెంబ్లీ నుంచి సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ పోటీ చేయాలని తాను వ్యక్తిగతంగా కోరుకుంటున్నానన్నారు. వైసీపీ పాలనలో రాష్ట్ర ప్రజలు నలిగిపోయారని, ఎక్కడ చూసినా ఆందోళనలు, నిరసనలు ఇందుకు నిదర్శనమని అన్నారు.

అలరించిన కవి సమ్మేళనం



కవులకు సన్మానం

తిరుపతి (కల్చరల్), జనవరి 13 : తిరుపతి జిల్లా రచయితల సంఘం (తిరసం) ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం యూత్ హాస్టల్లో నిర్వహించిన సంక్రాంతి కవిసమ్మేళనం అలరించింది. తిరసం అధ్యక్షుడు డాక్టర్ సాకం నాగరాజ అధ్యక్షతన జరిగిన సభలో ద్రవిడ విశ్వవిద్యాలయం ఉప కులపతి ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన తిరుపతి జిల్లా రచయితల సంఘంతో తనకు అనుబంధం ఉందన్నారు. జిల్లాలోని అన్ని సాహితీ సంఘాలు ఏకతాటిపైకి వచ్చి సాహితీ కృషి చేయడం చాలా సంతోషకరమైన అంశమన్నారు. తిరుపతిలో నిత్యం ఇలా సాహితీ పరిమళం గుభాళించాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ కవులు తమ కవితా గానంతో సభికులను అలరించారు. తిరసం కార్యనిర్వాహక అధ్యక్షుడు తోట వెంకటేశ్వర్లు సభానిర్వహణ చేశారు. ముఖ్య అతిథిని డాక్టర్ నెమిలేటి కిట్టన్న సభకు పరిచం చేశారు. బావుకబ్రహ్మ కలువగుంట రామమూర్తి కవితా విశ్లేషణ చేశారు. యువశ్రీ మురళి, పేరూరు బాలసుబ్రమణ్యం, ఏనుగు అంకమనాయుడు, చెన్నకేశవనాయుడు, ఆకుల మల్లేశ్వరరావు, శ్రీనివాసరావు, తిరుపతి కిరణ్, ఆకుతోట గజేంద్ర రెడ్డి, ఆర్‌సీకే రాజు, తమటం రామచంద్రారెడ్డి, దామోదర గుప్త, దూబగుంట రామకృష్ణ, పొక్కళ్ల సుభద్ర తదితరులు పాల్గొన్నారు. అనంతరం కవులను జ్ఞాపికలతో సత్కరించారు.

వీధి వ్యాపారులకు గొడుగుల వితరణ



గొడుగులు అందిస్తున్న మునికృష్ణనాయుడు, తదితరులు

తిరుపతి(విద్య), జనవరి 13: నగరంలోని నేతాజీ, గాంధీ రోడ్డులో వీధి వ్యాపారం చేసుకుంటున్న వారికి తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమినేని మునికృష్ణనాయుడు ఆధ్వర్యంలో శనివారం గొడుగులు వితరణ చేశారు. చిరు వ్యాపారులకు ఎండకు, వానకు రక్షణగా ఉండేందుకు తమవంతుగా క్లబ్ తరఫున ఈ మేరకు సాయం చేసినట్లు ఆయన తెలిపారు. క్లబ్ ఏర్పాటైన 105 సంవత్సరాల్లో ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. క్లబ్ కార్యదర్శి ముబారక్‌బాషా, ట్రెజరర్ వినోద్ వెంకటాచలం పాల్గొన్నారు.

చంద్రగిరి

తిరుచ్చి వాహనంపై దర్శనమిచ్చిన కల్యాణ వెంకన్న



చంద్రగిరి, జనవరి 13: శ్రీనివాస మంగాపురంలో వెలసిన కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం సాయంత్రం తిరుచ్చి వాహనంపై శ్రీదేవి భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపినాథ్, సూపరింటెండెంట్లు వెంకటస్వామి, మునిచెంగల్రాయులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, అర్జితం ఇన్‌స్పెక్టర్ ధనశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

చిన్ననాటి స్మృతులు చెప్పుకొంటూ..



భాకరాపేట, జనవరి 13 : చిన్ననాటి స్నేహితులు కలిసి చదువుకుని 40 సంవత్సరాలు గడిచిపోయింది. తాము తిరుగాడిన పల్లెసీమలు, పాఠశాల గుర్తు పట్టలేనంతగా మారిపోయాయి. తాము ఆటలాడి చదువుకున్న పాఠశాలలో ఆ స్నేహితులంతా శనివారం కలిశారు. సరదాగా కబుర్లు చెప్పుకొన్నారు. జీవితంలో ఎదుర్కొన్న ఆటుపోట్లు, సాధించిన లక్ష్యాలను ఒకరికొకరు మనసు ఇప్పి మాట్లాడుకున్నారు. శనివారం చిన్నగొట్టిగల్లు జిల్లా పరిషత్ హైస్కూల్ 1984 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు 40 సంవత్సరాల తరువాత కలుసుకున్నారు. ఆడుతూ ..పాడుతూ...చిన్ననాటి స్మృతులు చెప్పుకొంటు ఆనందగా గడిపారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన 90 ఏళ్ల వయసులో వున్న గురువు రమణా రెడ్డిని ఘనంగా సన్మానించారు. తమకు చదువు చెప్పిన గురువులలో నేడు ఒక్కరే ఉండడంతో అందరు ఎంతో భావోద్వేగానికి గురయ్యారు. కాలం ఎంతోవేగంగా గడిచిపోతుందని, జీవిత ఆశయాలను వాయిదాలు లేకుండా లక్ష్యం వైపు శ్రమించిన వారే విజేతలని రమణా రెడ్డి అన్నారు.

సంక్రాంతి నుంచి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు

- సప్తగిరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్



ఏఎస్ఎన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 13: సంక్రాంతి పండుగ నుంచి ఖాతాదారుల సౌకర్యార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ సౌకర్యాలతో కూడిన ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తున్నట్లు బ్యాంకు చైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. శనివారం చిత్తూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డిపాజిట్లపై ఇతర బ్యాంకులకంటే 3.5శాతం అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు వివరించారు. 2022-23 ఆర్థికసంవత్సరంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు వ్యాపార లావాదేవీలు రూ.2243 కోట్ల దాకా పెరిగినట్లు చెప్పారు.ఆరు జిల్లాల్లో 240 శాఖలతో నడుస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖలను త్వరలో మరో 10చోట్ల ప్రారంభిస్తామని తెలిపారు. డిపాజిట్లపై 1-2 సంవత్సరాల వరకు సాధారణ ఖాతాదారులకు 7.50శాతం, 60ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్లకు 8శాతం వడ్డీ, 2-3 సంవత్సరాల వరకు 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం అందిస్తామన్నారు. దీనబంధు పథకం కింద బంగారు నగల రుణాలు, ఎస్సీ, బీసీ ఖాతాదారులకు తక్కువ వడ్డీతో బంగారుపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న తరహా బ్యాంకుల్లో అతి తక్కువ నిరర్థక ఆస్తులు కల్గిన బ్యాంకుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు గుర్తింపు పొందిందన్నారు. తమ బ్యాంకులో ట్యాక్స్ సేవర్ డిపాజిట్ అందుబాటులో ఉందని, దీని ద్వారా ఖాతాదారులు 80-సి రాయితీ పొందవచ్చన్నారు. తమ బ్యాంకులో నిల్వచేసిన బ్యాంకు ఖాతాదారుల సొమ్ముకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.

చెంగారెడ్డికి పలువురి శుభాకాంక్షలు



చెంగారెడ్డిని సన్మానిస్తున్న రోజా దంపతులు - గాలి భానుప్రకాష్

నగరి, జనవరి 13: మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డి 91వ జన్మదిన వేడుకలు శనివారం సాయిబాబా గుడి ఆవరణలో జరిగాయి. మంత్రి రోజా, నగరి టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్, శ్రీశైలం ట్రస్టుబోర్డు ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కేజే శాంతి, నగరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ కేజే కుమార్, పుత్తూరుకు చెందిన అమ్ములు అలియాస్ ఏలుమలై, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు చిలకం ఈశ్వరప్రసాద రెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

అంగన్వాడీల నిరసన



ఎస్మా ప్రతులను మంటల్లో వేసి నిరసన

చంద్రగిరి, జనవరి 13: ప్రభుత్వం విడుదల చేసిన ఎస్మా చట్టం జీవోలను చంద్రగిరిలో అంగన్వాడీ వర్కర్లు భోగి మంటల్లో వేసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అంగన్వాడీ వర్కర్లు నినాదాలు చేశారు. అనంతరం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణిశ్రీ మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్ల కోసం ఉద్యమిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ వర్కర్లపై ఎస్మా చట్టాన్ని ప్రయోగించి, భయభ్రాంతులకు గురిచేయాలని చూస్తోందని తెలిపారు. తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించకపోతే ఉద్యమం తీవ్రరూపం దాల్చుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్లు లక్ష్మి, ప్రియదర్శిని, విజయకుమారి, నాగభూషణమ్మ, లీలా, నాగరాజమ్మ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శనలు



తిరుచానూరు, జనవరి 13: తిరుచానూరు రోడ్డు లోని శిల్పారామంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని తిరుపతికి చెందిన నటరాజ నృత్య కళాక్షేత్రం చిన్నారుల భరతనాట్య ప్రదర్శన చేశారు. పలు అన్నమయ్య కీర్తనలకు చిన్నారులు చేసిన నృత్యప్రదర్శన అలరించింది. వారికి ఏవో ఖాదరవల్లి ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఏనుగుల దాడిలో అరటి తోట ధ్వంసం



భాకరాపేట, జనవరి13: భాకరాపేట పంచాయతీ దేవపట్లవారిపల్లెకు చెందిన ఎర్రంరెడ్డి అరటి తోటను శుక్రవారం రాత్రి ఏనుగులు ధ్వంసం చేశాయి. అలాగే అదే గ్రామానికి చెందిన వెంకటరెడ్డికి చెందిన అర ఎకరం పశుగ్రాసాన్ని తొక్కి వేసి తినేశాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అటవీ శాఖ అధికారులు పంట పొలాలపై ఏనుగులు రాకుండా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

వైసీపీలో క్రిమినల్స్‌కే టిక్కెట్లు దక్కాయి

టీడీపీ నేతల ఎద్దేవా



సమావేశంలో మాట్లాడుతున్న సీఆర్ రాజన్

తిరుచానూరు, జనవరి 13: శాసనసభ ఎన్నికల్లో వైసీపీ తరఫున పోటీ చేయడానికి ప్రకటించిన అభ్యర్థుల్లో చాలా వరకు నేరచరిత్ర ఉన్నవారేనని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సీఆర్ రాజన్ విమర్శించారు. శనివారం తిరుచానూరులో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. జగన్ ప్రకటించిన వైసీపీ అభ్యర్థుల మూడవ జాబితాలో అత్యధిక శాతం నేర చరిత్ర ఉన్నవారేనని, సమాజంలో మంచివారే లేరా అని ప్రశ్నించారు. ఎమ్మెల్యేలుగా పోటీ చేయడానికి జగన్‌కు మనుషులు కరువయ్యారా అని ప్రశ్నించారు. చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి పీడీయాక్ట్ కేసులో జైలుకు వెళ్లి వచ్చారని, ఆయనపై ఇంకా అనేక కేసులు ఉన్నాయన్నారు. ఇసుక దందా, లాటరీ టిక్కెట్ల విక్రయాల్లో ప్రమేయం ఉందని ఆరోపించారు. గత ఎన్నికల్లో కాపు సామాజిక వర్గానికి కేటాయించిన సీటు ఈ ఎన్నికల్లో ఓ నేర చరిత్ర ఉన్న వ్యక్తికి ఇవ్వడం జగన్‌కే చెల్లిందన్నారు. నా ఎస్సీలు, ఎస్టీలు, నా బీసీలు అని జగన్ కపట ప్రేమ కనబరుస్తున్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎర్రచందనం, భూకబ్జాలు, ఇసుక దందాల ద్వారాకోట్ల రూపాయలు కొల్లగొట్టారని ఆరోపించారు. టీడీపీ నాయకులు ఈశ్వర్‌రెడ్డి, అమిలినేని మధు, శ్రీనివాసులు, కిషోర్‌రెడ్డి, హరిరామ్‌రెడ్డి పాల్గొన్నారు.

నిలుపుదల చేసిన నిధులను జమ చేయాలి

పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరామయ్య



తిరుపతి(కొర్లగుంట), జనవరి 13 : కేంద్ర ప్రభుత్వం తాజాగా విడుదల చేసిన నిధులలో నిలుపుదల చేసిన రూ.600కోట్లను వెంటనే గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్తుల ఖాతాలలో జమ చేయాలని పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సుబ్బరామయ్య డిమాండ్ చేశారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రెండవ విడత నిధులు 4 రోజుల క్రితం రూ.988కోట్లు కేంద్రం విడుదల చేసిందని గుర్తు చేశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఆ నిధుల్లో కోత విధించి కేవలం రూ.388కోట్లు జమచేయడం దారుణమన్నారు. ఇప్పటికే రూ.8,629కోట్ల నిధులను రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని వెల్లడించారు. దీన్ని పంచాయతీరాజ్ ఛాంబర్, సర్పంచుల సంఘం తీవ్రంగా ఖండిస్తోందన్నారు. నిధులను జమ చేయకపోతే పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

ఎర్రచందనం స్మగ్లర్‌కు ఎమ్మెల్యే టిక్కెట్టా!

- వైసీపీలో రెడ్లకు తప్ప అన్ని కులాలకూ అన్యాయమే
- జనసేన ఇన్‌ఛార్జి కిరణ్ రాయల్



తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 13 : సీఎం జగన్ ఎర్రచందనం స్మగ్లర్‌కు చిత్తూరు ఎమ్మెల్యే టిక్కెట్ ఇవ్వడం దారుణమని జనసేన తిరుపతి ఇన్‌ఛార్జి కిరణ్‌రాయల్ అన్నారు. శనివారం ప్రెస్ క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ రాయలసీమలో ఉన్న ఒక్క బలిజ సిట్టింగ్ ఎమ్మెల్యే శ్రీనివాసులకు సీటు ఇవ్వకపోయినా వైసీపీని ఆయన వెనకేసుకురావడాన్ని తప్పుపట్టారు. వైసీపీలో రెడ్లకు తప్ప ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, కాపులకు ప్రాధాన్యత లేదని విమర్శించారు. చిత్తూరు ఉమ్మడి జిల్లాలో రెడ్ల స్థానాలు తప్ప అన్ని స్థానాలు మార్చేయడమే దీనికి నిదర్శనమన్నారు. ఆర్టీసీ వైస్ చైర్మన్, చిత్తూరు వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డిపై తమిళనాడు, కర్ణాటక, ఏపీలో 48 కేసులతో పాటు పీడీ యాక్ట్ నమోదైందన్నారు. ఇలాంటి వ్యక్తులను జగన్ ప్రోత్సహిస్తూ ఉంటే ప్రజాస్వామ్యం ఉంటుందా అని ప్రశ్నించారు. స్మగ్లర్‌కు ఉన్న విలువ కాపులకు లేదన్నారు. ఇప్పటికైనా వైసీపీలో ఉన్న కాపులు బయటకు వచ్చి వాస్తవాలు మాట్లాడాలన్నారు. చిత్తూరు ఎమ్మెల్యే శ్రీనివాసులు పవన్ కల్యాణ్‌పై చేసిన ఆరోపణలను ఖండించారు. ఇసుక అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్న మంత్రి రోజాపై రౌడీషీట్ ఓపెన్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో జనసేన నాయకులు రాజమోహన్, సుమన్‌రాయల్, హిమవంత్, వంశీ, నాగరాజురాయల్, సురేష్, రాజేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎగసిన భోగి సంబరాలు



తిరుపతి(ఉపాధ్యాయనగర్), జనవరి 13 : సంక్రాంతిలో మొదటిదైన భోగి పండుగను నగర ప్రజలు శనివారం రాత్రి నుంచే ప్రారంభించారు. ప్రధాన కూడళ్లలో, ఇళ్లముంగిట భోగి మంటలు వెలిగించారు. వెచ్చదనాన్ని వెదజల్లే మంటలు ఎగసిపడుతుండగా... పిల్లలు, పెద్దలు భోగి మంటల చుట్టూచేరి కేరింతలు కొడుతూ ఆనందం పంచుకున్నారు. మహిళలు, యువతులు రంగురంగుల రంగవల్లుల రంగరింపులతో... గొబ్బెలు... గుమ్మడి పూల అలంకరణలతో ఇళ్ల ముంగిట, లోగిళ్లకు కొంగ్రొత్త కళను తీసుకువచ్చారు. నగరంలోని వివిధ కాలనీలు, ప్రాంతాలు, అపార్ట్‌మెంట్లలో భోగి మంటలతో పాటు పండుగ సంబరం ఉవ్వెత్తున ఎగసింది. తాతానగర్ యూత్ ఆధ్వర్యంలో తాతానగర్‌లోని గంగమ్మ ఆలయంవద్ద భోగిమంటలు వేసి పిల్లాపాపలు, పెద్ద సంబరాలు జరుపుకున్నారు.

26నుంచి తొండవాడలో ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 13: తొండవాడలో ఈనెల 26వ తేదీ నుంచి ఉచిత కంటి శుక్లాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నామని డాక్టర్ మోహన్ మల్లం తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ కాలిఫోర్నియాలో కంటి వైద్యుడిగా 36 సంవత్సరాలు పనిచేసి విరమణ పొందానని, తాను పుట్టిన ఊరికి ఎంతో కొంత మంచి చేయాలని ఉద్దేశంతో తండ్రి మునిరెడ్డి జ్ఞాపకార్థం రూ.15లక్షలతో చెన్నై శంకర్ నేత్రాలయతో కలిసి ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు నిర్వహించే ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. తొండవాడ సచివాలయంలో ఆధార్‌కార్డులు తీసుకువెళ్లి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. సదాశివరెడ్డి, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

న్యాయం జరిగే వరకు అండగా ఉంటా

స్థలం కబ్జా బాధితులకు జనసేన కిరణ్ భరోసా

తిరుపతి(రవాణా), జనవరి 13: కబ్జాకు గురైన స్థలాన్ని తిరిగి ఇప్పించే వరకు పోరాటం చేస్తానని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్ బాధితులకు భరోసా ఇచ్చారు. నగర పరిధిలోని జీవనకోన రాఘవేంద్ర నగర్‌లో సంపూర్ణమ్మ 1981లో 25సెంట్ల భూమిని కొనుగోలు చేశారు. కొంత కాలం క్రితం అధికార పార్టీకి చెందినవారు దానిపై కన్నేశారు. వెంటనే ఆక్రమించుకుని చుట్టూ ప్రహరీగోడ నిర్మించారు. విషయం తెలిసి ఆ వృద్ధురాలు ప్రశ్నించగా ఎవరూ సమాధానం చెప్పకపోగా బెదిరించి పంపేశారు. దాంతో ఆమె శనివారం కిరణ్‌రాయల్‌ను సంప్రదించారు. ఆయన అక్కడికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తిరుపతిలో స్థల కబ్జాలు పెరిగిపోయాయని విమర్శించారు. వృద్ధుల స్థలాన్ని సైతం కబ్జా చేయడం దారుణమన్నారు. రూ.5కోట్లు విలువ చేసే స్థలాన్ని ఎమ్మెల్యే, ఆయన అనుచరులు కలిసి కాజేయాలని చూడడం బాధాకరమన్నారు. ఈ విషయంలో కలెక్టర్, ఎస్పీని కలసి నిజమైన హక్కుదారులకు న్యాయం చేయాలని కోరతానన్నారు. అవసరమైతే పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకెళతానన్నారు.

ముగ్గురు సీఐలపై కేసు నమోదు

బీసీవై కార్యకర్తను చెప్పుతో కొట్టిన ఘటనపై స్పందించిన హక్కుల కమిషన్



సీఐలు రాఘవరెడ్డి - కృష్ణారెడ్డి - కృష్ణమోహన్

పుంగనూరు, జనవరి 13: పుంగనూరు సమీపంలోని చదళ్ల వద్ద బీసీవై పార్టీ కార్యకర్తను చెప్పుతో కొట్టి పోలీసుస్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్ స్పందించింది. పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలపై శనివారం కేసు నమోదు చేసింది.చదళ్ల వద్ద శనివారం నిర్వహించాల్సిన బీసీవై పార్టీ ధర్మ పోరాట సభ నిర్వహణకు శుక్రవారం ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అనుమతి లేదని అడ్డుకున్నారు. దీంతో బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్ర యాదవ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రైవేటు స్థలంలో మీటింగ్‌ను ముందురోజే అడ్డుకోవడంపై మండిపడ్డారు.ఈ నేపథ్యంలో పలుమార్లు పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, కృష్ణమోహన్‌లతో రామచంద్ర యాదవ్‌కు వాగ్వాదాలు జరిగాయి. యాదవ్‌ను అరెస్టు చేయాలని సీఐలు ప్రయత్నించగా సీఆర్పీఎఫ్ భద్రతా బలగాలు, బీసీవైపీ శ్రేణులు అడ్డుపడ్డారు. దీంతో బీసీవైపీ శ్రేణులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకుంటూ, కొడుతూ, పిడిగుద్దులతో కొందరి బట్టలు చింపి స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో బీసీవై పార్టీ కార్యకర్త వెంకటేశ్ జీపు ఎక్కలేదని గంగవరం సీఐ కృష్ణమోహన్ చెప్పుతో కొట్టి లాక్కెళ్లారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రాష్ట్ర మానవహక్కుల సంఘం జాయింట్ సెక్రటరీ టి.కరుణాకర్ యాదవ్ పుంగనూరులో పోలీసుల దాష్టీకంపై శనివారం న్యూఢిల్లీలోని జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.చెప్పుతో కొట్టి అవమాన పరిచిన గంగవరం, పుంగనూరు, చౌడేపల్లె సీఐలు కృష్ణమోహన్, రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ 707/ఐఎన్/2024 నెంబరుతో కేసు నమోదు చేసింది.

రామచంద్ర సహా 30మందిపై కేసు

చదళ్ల ఘటనలో పోలీసుల విధులకు అడ్డుపడ్డారంటూ బీసీవైపీ అధినేత బి.రామచంద్రయాదవ్‌తో పాటు 30 మందిపై సీఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేశారు. పుంగనూరు హెడ్‌కానిస్టేబుల్ ఎ.సుబ్రహ్మణ్యం స్పెషల్ రిపోర్టు మేరకు.. చదళ్ల సభ వద్ద 30 పోలీస్‌యాక్టు ఉందని, అందరూ వెళ్లిపోవాలని సూచించగా రామచంద్రయాదవ్, బీసీవైపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్, నవీన్, సుబ్రహ్మణ్యంరెడ్డి, బక్ష, వెంకటేశ్, రమేశ్‌యాదవ్, హరిబాబు, సత్యనారాయణ, సురేంద్ర తదితరులపై ఐపీసీ 143, 353, 506 రెడ్‌విత్ 149 సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు.

బీటీఆర్‌పురంలో ముగ్గుల పోటీలు



ముగ్గులు వేస్తున్న మహిళలు

తిరుపతి (రవాణా), జనవరి 13: మంగళం పరిధిలోని బీటీఆర్‌పురంలో శనివారం మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలు బీటీఆర్‌పురం సంక్షేమ సంఘం, వేమన విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో జరిగాయి. మహిళలు పెద్దసంఖ్యలో పాల్గొని రంగవల్లులను వేశారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. మిగిలిన వారికి ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. మొదటి మూడు స్థానాల్లో నాగలత, లీలావతి, కల్యాణి నిలిచారు. ఈ కార్యక్రమంలో వేమన విజ్ఞానకేంద్రం కార్యదర్శి మల్లారపు నాగార్జున, రాధాకృష్ణ, రాంబాబు, చలపతి, రేణు దీక్షిత్, ఆకుల మల్లేశ్వరరావు, మునిలక్ష్మి, తహసున్నీసా, జయంతి, కల్పన, వెంకటేశం, గుణశేఖర్ పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.26 కోట్లు

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.26 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 56,588 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 16,754 మంది తలనీలాలు సమర్పించారు.

తిరుమలలో డ్రోన్ నిషేధంపై అవగాహన కల్పిస్తాం

టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్



తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమలలో డ్రోన్ వినియోగంపై ఉన్న నిషేధం గురించి భక్తులకు అవగాహన కల్పిస్తామని టీటీడీ సీవీఎస్వో నరసింహకిషోర్ తెలిపారు. తిరుమల ఘాట్ రోడ్డులో శుక్రవారం డ్రోన్ కెమెరాతో వీడియో తీస్తూ పట్టుబడిన హర్యానాకు చెందిన దినేష్‌ను పోలీసులు విచారిస్తున్నట్లు చెప్పారు. కెమెరాలో ఘాట్ రోడ్డు విజువల్స్ తప్ప తిరుమలలో ఎక్కడా వీడియో తీసినట్లు లేదన్నారు. ఆయన సెల్‌ఫోన్‌ను కూడా పరిశీలన చేశామన్నారు. ఆర్మీకి చెందిన దినేష్ చాలా బాధ్యత కలిగిన వ్యక్తి అన్నారు. ఆలయాల పర్యటనలో భాగంగా తిరుమలకు వచ్చిన ఆయన కొండలను తీసే ప్రయత్నం చేశారన్నారు. తిరుమలలో డ్రోన్ నిషేధం ఉన్న విషయం ఆయనకు తెలీదన్నారు. పైగా ఆ డ్రోన్ ప్లాస్టిక్‌ది కావడంతో అలిపిరిలో ఉన్న స్కానర్లు స్కాన్ చేయలేదన్నారు. అలిపిరిలో అత్యాధునిక స్కానింగ్ యంత్రాల ఏర్పాటుపై చర్యలు తీసుకుంటున్నామన్నారు.

సప్తగిరి గ్రామీణ బ్యాంకు

(ప్రభుత్వ రంగ సంస్థ :: ఇండియన్ బ్యాంక్‌చే ప్రాయోజితం)
ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి, తిరుపతి జిల్లా

అనుబంధం -4ఎ (రూల్8(6) యొక్క అంశాలు చూడండి)

స్థిరాస్తుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్,2002 రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలు/ హామీదారులకు, తెలియజేయడమేమనగా ఈ క్రింద తెలిపిన స్థిరాస్తి బ్యాంకు వారి తనఖాలో వుండి సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఎం.ఆర్.పల్లి శాఖ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకుని ఉన్నారు. బ్యాంకు వారు దిగువ తెలిపిన ఋణమును రాబట్టుకొనుటకు ఆస్తిని "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" "ఎక్కడ ఏమి వున్నది అక్కడ అలానే" ప్రాతిపదికన వేలము ద్వారా తేది: **15.02.2024**న విక్రయించుటకు నిర్ణయించడమైనది.

ఋణగ్రహీత / తనఖాదారు: 1) టి.సుధాకర్ తండ్రి టి.గురవయ్య, 4-33 గోవిందనగర్, తిరుపతి, తిరుపతి జిల్లా

మరియు గ్యారంటార్లు: 1) టి.తనూజ భర్త టి.సుధాకర్,4-33 గోవిందనగర్, తిరుపతి, తిరుపతి జిల్లా 2) జి.శివశంకర్ రాజు తండ్రి జి.శ్రీనివాసరాజు, 22-4-48, ఎల్ఐజి, తుడా క్వార్టర్స్, మంగళం, తిరుపతి, తిరుపతి జిల్లా

రిఫరెన్స్: ఎల్‌పిఎంపి 50021457007

తేది: 20.11.2023 నాటికి బకాయి మొత్తం రూ.6,15,524/- (రూపాయలు ఆరు లక్షల పదహైదు వేల ఐదు వందల ఇరవై నాలుగు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర వ్యయాలతో సహా.

డిమాండ్ నోటీసు తేది: 04.07.2023 స్వాధీనతా తేది: 10.10.2023

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు: తిరుపతి జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, శ్రీకాళహస్తి సబ్ జిల్లా, శ్రీకాళహస్తి మండలం, వాగవేడు సర్వే గ్రూపు, వాగవేడు గ్రామలెక్కదాఖలా, డిటిసిపి, గుంటూరు(అమరావతి) వారిచే ఎల్.పి.నెం.58/2017/ఎ, తేది: 28.04.2017గా అప్రూవల్ పొంది సర్వేనెం.52/3బి నందు ఎ.1.21 లో వేసిన శ్రీ శ్రీనివాస గార్డెన్స్-2 లోని ప్లాట్లుకు హద్దులు:

ఐటంనెం.1: ప్లాటు నెం.478కు హద్దులు: తూర్పు: 33అ. వెడల్పు గల రోడ్డు, పడమర: ఇతరుల భూమి, ఉత్తరం: ప్లాటు నెం476 & 477 లోని స్థలం, దక్షిణం: ప్లాటు నెం.479లోని స్థలం. ఈ హద్దుల మధ్య తూర్పు - పడమర:(ఉత్తరం వైపు): 84.75అ. లేదా 25.848మీ. తూర్పు- పడమర (దక్షిణం వైపు): 86.5 అ. లేదా 26.382 మీ., ఉత్తరం నుండి దక్షిణం: (తూర్పు వైపు) 33అ. లేదా 10.065మీ. ఉత్తరం నుండి దక్షిణం: (పడమర వైపు) : 33అ. లేదా 10.065మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 2925చ.అ. లేదా 313.95చ.గ. ఖాళీ స్థలం

ఐటంనెం.2: ప్లాటు నెం.479కు హద్దులు: తూర్పు: 33అ. వెడల్పు గల రోడ్డు, పడమర: ఇతరుల భూమి, ఉత్తరం: ప్లాటు నెం478లోని స్థలం, దక్షిణం: ప్లాటు నెం.480లోని స్థలం. ఈ హద్దుల మధ్య తూర్పు - పడమర:(ఉత్తరం వైపు): 86.5 అ. లేదా 26.382 మీ. తూర్పు- పడమర (దక్షిణం వైపు): 88 అ. లేదా 26.840 మీ., ఉత్తరం నుండి దక్షిణం: (తూర్పు వైపు) 33అ. లేదా 10.065మీ. ఉత్తరం నుండి దక్షిణం: (పడమర వైపు) : 33అ. లేదా 10.065మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 2879.25 చ.అ. లేదా 319.91చ.గ. ఖాళీ స్థలం

తనఖాదారు పేరు వివరములు: టి.సుధాకర్ తండ్రి టి.గురవయ్య, 4-33 గోవిందనగర్, తిరుపతి, తిరుపతి జిల్లా (ఋణగ్రహీత / తనఖాదారు)
రిజర్వు ధర : రూ.15,85,000/- (పదహైదు లక్షల ఎనభై ఐదు వేల రూపాయలు మాత్రమే)
ధరావత్తు : రూ.1,59,000/- (ఒక లక్ష యాభై తొమ్మిది వేల రూపాయలు మాత్రమే)
మునుపటి బకాయిలు : లేవు

విక్రయం / వేలం తేది, సమయం & స్థలం: 15.02.2024, మ.2.00 గం॥లకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి,

బిడ్/ టెండరు సమర్పణకు ఆఖరు తేది & సమయం: తేది: 15.02.2024 (గురువారం) & 2.00గం॥ల లోపు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి వద్ద

టెండరు ఫారములు దొరకు స్థలము:
1) బ్రాంచ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి,
2) ఎజిఎం/ చీఫ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, హెడ్ ఆఫీస్, చిత్తూరు
3) అధీకృత అధికారి, ప్రాంతీయ కార్యాలయము, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, తిరుపతి

మరిన్ని వివరముల కొరకు బిడ్డరు బ్యాంకు యొక్క వెబ్‌సైట్ www.saptagirigrameenabank.in నందు లేదా బ్రాంచ్ మేనేజర్, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి, సెల్:8886644055ను సంప్రదించగలరు.

తేది: 08.01.2024, ప్రదేశం:తిరుపతి — సం॥ అధీకృత అధికారి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్

సప్తగిరి గ్రామీణ బ్యాంకు

(ప్రభుత్వ రంగ సంస్థ :: ఇండియన్ బ్యాంక్‌చే ప్రాయోజితం)
ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి, తిరుపతి జిల్లా

అనుబంధం -4ఎ (రూల్8(6) యొక్క అంశాలు చూడండి)

స్థిరాస్తుల అమ్మకం ప్రకటన

సెక్యూరిటైజేషన్ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్,2002 రూల్ 8(6) నిబంధనతో చదువబడే సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం,2002 ప్రకారం స్థిరాస్తుల అమ్మకం కొరకు అమ్మకం ప్రకటన

ఇందుమూలముగా సాధారణ ప్రజానీకానికి ముఖ్యముగా ఋణగ్రహీతలు/ హామీదారులకు, తెలియజేయడమేమనగా ఈ క్రింద తెలిపిన స్థిరాస్తి బ్యాంకు వారి తనఖాలో వుండి సప్తగిరి గ్రామీణ బ్యాంక్, ఎం.ఆర్.పల్లి శాఖ యొక్క అధీకృత అధికారిచే స్వాధీనం చేసుకుని ఉన్నారు. బ్యాంకు వారు దిగువ తెలిపిన ఋణమును రాబట్టుకొనుటకు ఆస్తిని "ఎక్కడ ఎలా వున్నది అక్కడ అలానే" "ఎక్కడ ఏమి వున్నది అక్కడ అలానే" ప్రాతిపదికన వేలము ద్వారా తేది: **15.02.2024**న విక్రయించుటకు నిర్ణయించడమైనది.

ఋణగ్రహీత / తనఖాదారు: 1) శ్రీమతి ఇ.వరలక్ష్మి భర్త ఇ.వాసుదేవులు రెడ్డి, 2-157/1సి, భూపాల్ హౌసింగ్ కాలనీ, తిరుపతి, తిరుపతి జిల్లా

మరియు గ్యారంటారు: 1) శ్రీమతి కె.శారద భర్త లేట్ కె.శ్రీనివాసులురెడ్డి, 6-1-74/ఎ, వరదరాజనగర్, తిరుపతి, తిరుపతి జిల్లా

రిఫరెన్స్: ఎల్‌పిఎంపి 50021291628

తేది: 28.09.2023 నాటికి బకాయి మొత్తం రూ.9,91,622/- (రూపాయలు తొమ్మిది లక్షల తొంభై ఒక్క వేల ఆరు వందల ఇరవై రెండు రూపాయలు మాత్రమే) మరియు తదుపరి వడ్డీ, ఖర్చులు, ఛార్జీలు మరియు ఇతర వ్యయాలతో సహా.

డిమాండ్ నోటీసు తేది: 10.05.2022 స్వాధీనతా తేది: 09.02.2023

స్థిరాస్తి వివరములు

షెడ్యూలు: ఐటంనెం.1:- చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, శ్రీకాళహస్తి సబ్ జిల్లా, శ్రీకాళహస్తి మండలం, వాగవేడు సర్వే గ్రూపు, వాగవేడు గ్రామలెక్కదాఖలా, డిసిటిపి గుంటూరు (అమరావతి) ప్లాట్స్ వారిచే ఎల్.పి.నెం.58/2017/ఎ, తేది: 28.04.2017గా అప్రూవల్ పొంది సర్వేనెం.54/1 నందు ఎ.0.056లలో శ్రీనివాసా గార్డెన్స్-2 పేరున వేసిన ప్లాట్లలో ప్లాటు నెం.462కు హద్దులు: తూర్పు: 33అ. వెడల్పు గల లేఔట్ రోడ్డు, పడమర: ఇతరుల భూమి, ఉత్తరం ప్లాటు నెం.463& 470 స్థలం, దక్షిణం ప్లాటు నెం.461 స్థలం. ఈ హద్దుల మధ్య తూర్పు- పడమర: (ఉత్తరం వైపు) 85అ. లేదా 25.925మీ., తూర్పు- పడమర: (దక్షిణం వైపు) 92.5అ. లేదా 28.212 మీ., ఉత్తరం నుండి దక్షిణం: (తూర్పు వైపు): 33అ. లేదా 10.065మీ. ఉత్తరం నుండి దక్షిణం: (పడమర వైపు): 33.75 అ. లేదా 10.293 మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 2962.03చ.అ. లేదా 329.11చ.గ. స్థలం.

షెడ్యూలు: ఐటంనెం.2:- చిత్తూరు జిల్లా, శ్రీ బాలాజి రిజిస్ట్రేషన్ జిల్లా, తిరుపతి, శ్రీకాళహస్తి సబ్ జిల్లా, శ్రీకాళహస్తి మండలం, వాగవేడు సర్వే గ్రూపు, వాగవేడు గ్రామలెక్కదాఖలా, డిసిటిపి గుంటూరు (అమరావతి) ప్లాట్స్ వారిచే ఎల్.పి.నెం.58/2017/ఎ, తేది: 28.04.2017గా అప్రూవల్ పొంది సర్వేనెం.54/1 నందు ఎ.0.056లలో శ్రీనివాసా గార్డెన్స్-2 పేరున వేసిన ప్లాట్లలో ప్లాటు నెం.461కు హద్దులు: తూర్పు: 33అ. వెడల్పు గల లేఔట్ రోడ్డు, పడమర: ఇతరుల భూమి, ఉత్తరం: ప్లాటు నెం.462 స్థలం, దక్షిణం: సర్వేనెం.52/9ఎ లోని స్థలం. ఈ హద్దుల మధ్య తూర్పు- పడమర: (ఉత్తరం వైపు) 92.5 అ. లేదా 28.212మీ., తూర్పు- పడమర: (దక్షిణం వైపు) 97.5 అ. లేదా 29.737 మీ., ఉత్తరం నుండి దక్షిణం: (తూర్పు వైపు): 34.5అ. లేదా 10.552మీ. ఉత్తరం నుండి దక్షిణం: (పడమర వైపు): 43.5.75 అ. లేదా 13.343 మీ. వెరశి మొత్తం విస్తీర్ణం 3716.875చ.అ. లేదా 412.98 చ.గ. స్థలం.

తనఖాదారు పేరు వివరములు: శ్రీమతి ఇ.వరలక్ష్మి భర్త ఇ.వాసుదేవులరెడ్డి, 2-157/1సి, భూపాల్ హౌసింగ్ కాలనీ, తిరుపతి, తిరుపతి జిల్లా (ఋణగ్రహీత / తనఖాదారు)
రిజర్వు ధర : రూ.14,25,000/- (పద్నాలుగు లక్షల ఇరవై ఐదు వేల రూపాయలు మాత్రమే)
ధరావత్తు : రూ.1,43,000/- (ఒక లక్ష నలభై మూడు వేల రూపాయలు మాత్రమే)
మునుపటి బకాయిలు : లేవు

విక్రయం / వేలం తేది, సమయం & స్థలం: 15.02.2024, మ.2.00 గం॥లకు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి,

బిడ్/ టెండరు సమర్పణకు ఆఖరు తేది & సమయం: తేది: 15.02.2024 (గురువారం) & 2.00గం॥ల లోపు సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి వద్ద

టెండరు ఫారములు దొరకు స్థలము:
1) బ్రాంచ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి,
2) ఎజిఎం/ చీఫ్ మేనేజర్, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, హెడ్ ఆఫీస్, చిత్తూరు
3) అధీకృత అధికారి, ప్రాంతీయ కార్యాలయము, సప్తగిరి గ్రామీణ బ్యాంకు, తిరుపతి

మరిన్ని వివరముల కొరకు బిడ్డరు బ్యాంకు యొక్క వెబ్‌సైట్ www.saptagirigrameenabank.in నందు లేదా బ్రాంచ్ మేనేజర్, ఎం.ఆర్.పల్లి శాఖ, తిరుపతి, సెల్:8886644055ను సంప్రదించగలరు.

తేది: 08.01.2024, ప్రదేశం:తిరుపతి — సం॥ అధీకృత అధికారి, సప్తగిరి గ్రామీణ బ్యాంక్

పండగొచ్చెనమ్మో..!

- నగరానికి సంక్రాంతి శోభ
- కొనుగోలుదారులతో కళకళలాడిన షాపులు





తిరుపతి (కల్చరల్), జనవరి 13: సంక్రాంతిని పురస్కరించుకుని నగరానికి పండగ కళ వచ్చింది. ఇప్పటికే చాలామంది వారివారి స్వస్థలాలకు తరలి వెళ్లగా ఇక్కడున్న వారు పల్లెల తరహాలో పండగ చేసుకునేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. భోగికి అవసరమైన సామగ్రి సిద్ధం చేసుకున్నారు. రెండు మూడు రోజులుగా గాంధీరోడ్డు, చిన్నబజారు వీధి, తీర్థకట్ట వీధి తదితర ప్రాంతాల్లోని వస్త్రాల దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసిపోయాయి. చెరకు గడలు, అరటి పిలకలు, గుమ్మడి కాయలు, పసుపు మొక్కలు, పూలు, పండ్ల దుకాణాలు పెద్ద సంఖ్యలో వెలిశాయి. నాలుగు కాళ్ల మండపం నుంచి కృష్ణాపురం ఠానా వరకూ, తిలక్ రోడ్డు, వీవీ మహల్ రోడ్డులలో ట్రాఫిక్ అంతరాయంతో వాహనదారులు ఇబ్బందులు పడ్డారు. పండగ కావడంతో పూలు, పండ్ల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. నగరంలోని విద్యా సంస్థలు, వ్యాపార సంస్థలు ముందస్తు సంక్రాంతి వేడుకలు జరుపుకున్నాయి. ప్రధాన వీధులు, అపార్ట్‌మెంట్లలో ముగ్గులు తీర్చిదిద్దారు. గొబ్బెమ్మలను పెడుతున్నారు. గంగిరెద్దులు, హరిదాసులు అక్కడక్కడా కనిపిస్తూ పండగను స్వాగతిస్తున్నారు. కాగా, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, టీటీడీ ఈవో ధర్మారెడ్డి, టీటీడీ పాలక మండలి అధ్యక్షుడు భూమన కరుణాకరరెడ్డి, ఎస్పీ పరమేశ్వరరెడ్డి, మేయర్ శిరీషా, ఎంపీ మద్దెల గురుమూర్తి తదితరులు ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు. కాగా తిరుపతికి చెందిన రాయలసీమ రంగస్థలి సంస్థ శనివారం గోవిందరాజస్వామి ఆలయ మాడవీధులలో నగరసంకీర్తన నిర్వహించింది. సుమారు 60 మంది కళాకారులు పాల్గొన్నారు. అలాగే తిరుపతికి చెందిన వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ ఆధ్వర్యంలో నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాల మైదానంలో సంక్రాంతి సంబరాలు చేశారు. పతంగులు ఎగుర వేసి, భోగి మంటలలో చలికాగి, గంగిరెద్దులు, కోడి పందాలు, బొంగరాలు, గోలీలు, కర్రసాము వంటి పల్లె ఆటలలో ఓలలాడారు. అనంతరం గ్రామీణ టీవీ వంటకాలను ఆరగించారు. నేతలు ఆర్‌సీ మునికృష్ణ, నవీన్‌కుమార్ రెడ్డి, గుండాల గోపినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





రైల్వేకాలనీ, మధురానగర్‌లో భోగి మంటలు వేస్తున్న స్థానిక యువత

జల్లికట్టు, కోడిపందేలకు అనుమతిలేదు

- ఎస్పీ పరమేశ్వరరెడ్డి



తిరుపతి(నేరవిభాగం), జనవరి 13 : జల్లికట్టు, కోడి పందేలు, పేకాట ఆడటం చట్ట వ్యతిరేకమని, సంక్రాంతి పండుగ సందర్భంగా వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ పరమేశ్వరరెడ్డి అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అలాంటివి నిర్వహిస్తే 8099999977కు సమాచారం అందించాలని కోరారు. పండుగకు స్వస్థలాలకు వెళ్లే అవకాశం ఉన్నందున దొంగతనాలు జరిగే అవకాశాలున్నాయని, అలాంటి వారు ఇళ్లలో విలువైన బంగారు, వెండి నగలు, నగదు ఉంచరాదని సూచించారు. సంబంధిత పోలీసు స్టేషన్‌ను సంప్రదించి ఎల్‌హెచ్‌ఎంఎస్ సదుపాయాన్ని ఉపయోగించుకోవాలని కోరార ు.

ఎస్మా ప్రతులను దగ్ధం చేసి నిరసన

తిరుపతి (రవాణా), జనవరి 13 : చర్చల పేరుతో కాలయాపన చేయడం, బెదిరింపులకు గురిచేయడం, ఎస్మాను ప్రయోగించడం వంటి చర్యలను నిరసిస్తూ అంగన్వాడీలు తిరుపతి మున్సిపల్ కార్యాలయం వద్ద శనివారం ఉదయం భోగి మంటల్లో ఎస్మా ప్రతులను దగ్ధం చేశారు. ముందుగా సమ్మె శిబిరం వద్ద సంక్రాంతి ముగ్గులను ఆకర్షణీయంగా తీర్చిదిద్దారు. ముగ్గుల మధ్యలో భోగి మంటలు వేసి, అందులో ఎస్మా ప్రతులను దగ్ధం చేస్తూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి మాట్లాడుతూ ఆరుసార్లు చర్చలు జరిపిన ప్రభుత్వం ఎందుకు సమస్యలను పరిష్కరించడం లేదని ప్రశ్నించారు. సీఎం జగన్ అంగన్వాడీల సహనానికి పరీక్ష పెడుతున్నారన్నారు. పది రోజుల్లో విధుల్లో చేరకుంటే ఉద్యోగాల నుంచి తొలగిస్తామని, కొత్తవారిని ఎంపిక చేస్తామని బెదిరింపులకు పాల్పడడం దేనికి సంకేతమని ప్రశ్నించారు. ఈ విషయంలో ప్రభుత్వ తీరును సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తోందని, రాబోయే రోజుల్లో ప్రత్యక్ష పోరాటాల్లోకి రావాల్సి వస్తుందని హెచ్చరించారు. వేతనాలు పెంచకుండా సమ్మె విరమించే ప్రసక్తే లేదన్నారు. ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ జిల్లా కార్యదర్శి కుమార్, ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి సత్యనారాయణ వారి బృందం మద్దతు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నేత సుబ్రహ్మణ్యం, నగర ప్రధాన కార్యదర్శి వేణుగోపాల్, తంజావూరు మురళి, పార్థసారథి, హరి, అంగన్వాడీలు నాగరాజమ్మ, జయప్రభ, గీత, సుజిత, కల్పన, రోజా, సుశీలమ్మ, గోమతి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.



అంగన్వాడీలకు బాలయ్య అభిమానుల మద్దతు



తిరుపతి(కొర్లగుంట), జనవరి 13: సమస్యల పరిష్కారం కోసం పాత మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న అంగన్వాడీలకు సినీ నటుడు బాలకృష్ణ అభిమానులు శనివారం మద్దతు తెలిపారు. పండగపూట మహిళలను రోడ్డు మీదకు వచ్చేలా చేసిన ఈ ప్రభుత్వం వచ్చే ఎన్నికల్లో తగిన మూల్యం చెల్లించక తప్పదని బాలకృష్ణ అభిమానుల సంఘం నాయకుడు మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం తమవంతు సాయంగా భోజనం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణరెడ్డి, తుడా మాజీ ఛైర్మన్ నరసింహయాదవ్, కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ, వూకా విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

సీబీఎస్‌లో సంక్రాంతి సందడి



తిరుపతి(కొర్లగుంట), జనవరి 13 : సంక్రాంతి నేపథ్యంలో సెంట్రల్ బస్టేషన్‌లో శుక్రవారం ప్రయాణికుల రద్దీ కనిపించింది. ఆర్టీసీ యంత్రాంగం ప్రధాన నగరాలకు అదనపు బస్సులు ఏర్పాటు చేసింది. ఉదయం హైదరాబాదు నుంచి, సాయంత్రం చెన్నై, బెంగళూరు, విజయవాడ నగరాల నుంచి వచ్చిన ప్రయాణికులతో బస్టాండు కిక్కిరిసింది. ఇక్కడి నుంచి పల్లెలకు చేరుకునే వారు, పండుగ సామగ్రి కోసం వచ్చిన వారితో పల్లెవెలుగు బస్సులు నిండిపోయాయి. ఒక్కో సమయంలో బస్సులు అందుబాటులో లేక ప్లాట్‌ఫాంల వద్ద నిరీక్షణ తప్పలేదు. పలుమార్లు ట్రాఫిక్ స్తంభించింది. శ్రీనివాస సేతుపైనా వాహనాల రాకపోకలు అధికంగా కనిపించాయి.


సంప్రదాయాలను కాపాడుకుందాం



రాస్ ప్రధాన కార్యాలయంలో సంక్రాంతి సంబరాలు


తిరుపతి(ఆటోనగర్) జనవరి 13 : అంతరించిపోతున్న సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని రాష్ట్రీయ సేవా సమితి ప్రధాన కార్యదర్శి ఎస్.వెంకటరత్నం అన్నారు. స్థానిక రాస్ ప్రధాన కార్యాలయంలో శనివారం ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంప్రదాయ దుస్తులు ధరించి భోగిమంటలు వేసి పొంగళ్లు పెట్టారు. ముగ్గులు వేశారు. వెంకటరత్నం మాట్లాడుతూ తెలుగు సంప్రదాయాలను భావితరాలు గుర్తించుకునేలా పండుగలు నిర్వహించాలన్నారు. రాస్ జాయింట్ సెక్రటరీ మమత మాట్లాడుతూ ఇకపై రాస్‌లో ప్రతి పండుగనూ సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహిస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వి.నాగరాజు, రాస్ అధికారులు శ్రీనివాసులు, రమేష్‌రెడ్డి, బాలాజీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ టీచర్స్ సంఘ డైరీ ఆవిష్కరణ



తిరుపతి(విద్య), జనవరి 13 : స్థానిక ఎంపీ కార్యాలయంలో వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ క్యాలెండర్‌ను ఎంపీ గురుమూర్తి శనివారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ టీచర్లు అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని విద్యార్థులను గ్లోబల్ సిటిజన్స్‌గా తయారు చేయాలని ఆకాంక్షించారు. సంఘ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. జిల్లా అధ్యక్షురాలు మద్దెల మునిశారద, ప్రధాన కార్యదర్శి వి.ఎల్లప్పరెడ్డి, కోశాధికారి బాబూలాల్, ఉపాధ్యక్షులు అల్లయ్య, నఫీసా, మీడియా ఇన్‌చార్జ్ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించండి



కృష్ణబాబుకు ప్రసాదాలు అందజేస్తున్న ఉద్యోగ సంఘ నేతలు

తిరుపతి సిటీ, జనవరి 13 : ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సహకరించాలని ఉద్యోగ సంఘం నేతలు ఉన్నతాధికారులను కోరారు. ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ కార్యదర్శి రాజా సంఘాల నేతలతో కలిసి శనివారం విజయవాడలోని వైద్య ఆరోగ్య, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను కలిసి శ్రీవారి ప్రసాదాలను అందజేశారు. వైద్య ఆరోగ్యశాఖ ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు, డీఎంఈ నరసింహం, డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డాక్టర్ పద్మావతిని కలిసి ప్రసాదాలను అందించి నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వారి వెంట జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్రాన్, సహాయక కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

జగన్ రెడ్డి రూ.లక్షల కోట్లు దోచేశారు

టీడీపీ మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ



తిరుపతి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ప్రజల సొమ్మును లక్షల కోట్లు దోచేస్తే, ఆయన శిష్యపరివారం వేలకోట్లు రూపాయలు వెనకేసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ ఆరోపించారు. శనివారం ఆమె తన నివాసంలో మీడియాతో మాట్లాడారు. అవినీతిలో జగన్‌ను గిన్నిస్ బుక్‌లో ఎక్కించినా ఆశ్చర్యపోవాల్సిన పనిలేదన్నారు. 36కేసులు పెట్టుకుని కోర్టుకు హాజరుకాకుండా 344 వాయిదాలు వేసుకున్నాడని, శిక్షపడుతుందని భయంతోనే కోర్టుకు హాజరుకావడంలేదని అన్నారు.ఆయన జేబు సంస్థ అయిన సీఐడీని అడ్డుపెట్టుకుని చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారని పేర్కొన్నారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమానికి రాష్ట్ర ప్రజలు పూర్తి మద్దతు ఇస్తున్నారన్నారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ప్రజల్లో సరికొత్త వెలుగులు రాబోతున్నాయని చెప్పారు.టీడీపీ, జనసేన సంకీర్ణ ప్రభుత్వంతో రాష్ట్రానికి మంచి రోజులు వస్తాయన్నారు.కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ,బుల్లెట్ రమణ, దంపూరి భాస్కర్, చినబాబు, మహేష్ యాదవ్, ఊట్ల సురేంద్ర నాయుడు, రజినీకాంత్ నాయుడు, కరాటే చంద్ర, కొట్టే హేమంత్ రాయల్, రామ్మూర్తి రాయల్, విశ్వనాథం, రాజారామ్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ పాలనలో ఆర్థిక వ్యవస్థ పతనం : టీడీపీ



మీడియాతో నరసింహయాదవ్

తిరుపతి(తిలక్‌రోడ్), జనవరి 13 : సీఎం జగన్ పాలనలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ పతనమైపోయిందని టీడీపీ తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు నరసింహయాదవ్ విమర్శించారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ సంక్షేమ పథకాల పేరుతో రాష్ట్రాన్ని కొల్లగొట్టారని తెలిపారు. జగన్‌పై ఉన్న కేసులను చూసి జడ్జిలే విస్మయం చెందుతున్నారని, ఇన్ని కేసులు పెట్టుకుని వాయిదాలకు ఎందుకు హాజరుకావడం లేదని ప్రశ్నించిన సందర్భాలు ఉన్నాయని అన్నారు. జగన్ చేసిన ఆర్థిక నేరాలకు యావజ్జీవ శిక్ష తప్పదని జోస్యం చెప్పారు. 2004లో అప్పుల కారణంగా హైదరాబాదులోని ఇల్లు అమ్ముకునే స్థితిలో ఉన్న ఆయన 19 ఏళ్లల్లో 4లక్షల కోట్ల ప్రజా సంపదను కొల్లగొట్టారని ఆరోపించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రికీ లేని ఆస్తులు ఎలా సంపాదించారో చెప్పాలన్నారు. చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి 53 రోజులు జైల్లో పెట్టిన సీఐడీ సరైన రుజువులు చూపలేకపోయిందని గుర్తు చేశారు. రానున్న ఎన్నికల్లో వైసీపీ ఇంటికి పోవడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్పొరేటర్ ఆర్‌సీ మునికృష్ణ, నాయకులు వూకా విజయకుమార్, యశ్వంత్‌రెడ్డి, జగన్నాథం, మనోహర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

వెంకన్న సేవలో ప్రముఖులు



ఆలయం ముందు చంద్రశేఖర్ తోట

తిరుమల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : తిరుమల శ్రీవారిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో గూగుల్ వైస్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్ తోట, మాజీ మంత్రి దేవినేని ఉమా, ప్రభుత్వ విప్ శ్రీకాంత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు అన్నా రాంబాబు, కాలేరు వెంకటేష్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు. దేవినేని ఉమా ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ, రామాలయం ప్రారంభోత్సవం సందర్భంగా శ్రీవారిని దర్శించుకుని రాష్ట్ర సుభిక్షంగా ఉండాలని ప్రార్థించానన్నారు. శ్రీవారు కొండ దిగే సమయం ఆసన్నమైందని, రామ రాజ్యం రాబోతోందని, ప్రజలు సంతోషంగా ఉంటారని అన్నారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ముగ్గుల పోటీల విజేతకు బహుమతి ప్రదానం చేస్తున్న జనసేన నాయకులు

తిరుపతి(కొర్లగుంట), జనవరి 13 : జనసేన పార్టీ ఆధ్వర్యంలో నగర పరిధిలోని 14వ డివిజన్ ఎస్టీవీ నగర్ వేదికగా శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. మన ఊరు-మన ఆట పేరుతో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో 50 మంది మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పి.హరిప్రసాద్, తిరుపతి నియోజకవర్గ ఇన్‌చార్జ్ కిరణ్‌రాయల్, నగరాధ్యక్షుడు రాజారెడ్డి పాల్గొని విజేతలు పల్లవికి ప్రథమ(రూ.5వేలు), సుజాతకు ద్వితీయ(రూ.3వేలు), రాధాకు తృతీయ(రూ.2వేలు), మిగిలిన వారికి కన్సొలేషన్ బహుమతి కింద టీకప్ సెట్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆకేపాటి సుభాషిణి, బలరాం, పవన్, కిషోర్, మనోజ్, జ్యోతి, లక్ష్మి, మధులత, చందన, కోకిల, దుర్గ దివ్య, బాబ్జి, ఆనంద్, మధుబాబు, రాజమోహన్, దినేష్‌జైన్, పార్థు, నాగరాజు, వంశీ, హిమవంత్, గోపి, హేమంత్, పురుషోత్తం, సాయి, నవీన్, దిలీప్ పాల్గొన్నారు.

మలబార్‌లో మైన్ డైమండ్స్ షో

తిరుపతి(కొర్లగుంట), జనవరి 13: మలబార్ షోరూంలో మైన్ డైమండ్ ప్రదర్శన ఏర్పాటు చేశారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ ప్రత్యేక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు షోరూం హెడ్ రిజీష్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. నిత్యం ధరించే నగలు, వివాహ ఆభరణాలు, లైట్ వెయిట్ హారాలు, పురుషుల ఆభరణాలు, ప్లాటినం సముదాయం సమకూర్చామని, 16వ తేదీ వరకు అందుబాటులో ఉంటుందని, నగర ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ముగ్గురు సీఐలపై కేసు నమోదు

బీసీవై కార్యకర్తను చెప్పుతో కొట్టిన ఘటనపై స్పందించిన హక్కుల కమిషన్



సీఐలు రాఘవరెడ్డి - కృష్ణారెడ్డి - కృష్ణమోహన్

పుంగనూరు, జనవరి 13: పుంగనూరు సమీపంలోని చదళ్ల వద్ద బీసీవై పార్టీ కార్యకర్తను చెప్పుతో కొట్టి పోలీసుస్టేషన్‌లో చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై జాతీయ మానవహక్కుల కమిషన్ స్పందించింది. పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలపై శనివారం కేసు నమోదు చేసింది.చదళ్ల వద్ద శనివారం నిర్వహించాల్సిన బీసీవై పార్టీ ధర్మపోరాట సభ నిర్వహణకు శుక్రవారం ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు అనుమతి లేదని అడ్డుకున్నారు. దీంతో బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రైవేటు స్థలంలో మీటింగ్‌ను ముందురోజే అడ్డుకోవడంపై మండిపడ్డారు.ఈ నేపథ్యంలో పలుమార్లు పుంగనూరు, చౌడేపల్లె, గంగవరం సీఐలు రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డి, కృష్ణమోహన్‌లతో రామచంద్రయాదవ్‌కు వాగ్వాదాలు జరిగాయి. యాదవ్‌ను అరెస్టు చేయాలని సీఐలు ప్రయత్నించగా సీఆర్పీఎఫ్ భద్రతా బలగాలు, బీసీవైపీ శ్రేణులు అడ్డుపడ్డారు. దీంతో బీసీవైపీ శ్రేణులను పోలీసులు బలవంతంగా ఈడ్చుకుంటూ, కొడుతూ, పిడిగుద్దులతో కొందరి బట్టలు చింపి స్టేషన్‌కు తరలించారు. ఈ సమయంలో బీసీవై పార్టీ కార్యకర్త వెంకటేశ్ జీపు ఎక్కలేదని గంగవరం సీఐ కృష్ణమోహన్ చెప్పుతో కొట్టి లాక్కెళ్లారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో కడప జిల్లా ప్రొద్దుటూరుకు చెందిన రాష్ట్ర మానవ హక్కుల సంఘం జాయింట్ సెక్రటరీ టి.కరుణాకర్ యాదవ్ పుంగనూరులో పోలీసుల దాష్టీకంపై శనివారం న్యూఢిల్లీలోని జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.చెప్పుతో కొట్టి అవమాన పరిచిన గంగవరం, పుంగనూరు, చౌడేపల్లె సీఐలు కృష్ణమోహన్, రాఘవరెడ్డి, ఎం.కృష్ణారెడ్డిలపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చేసిన ఫిర్యాదుపై ఎన్‌హెచ్‌ఆర్సీ 707/ఐఎన్/2024 నెంబరుతో కేసు నమోదు చేసింది.

రామచంద్ర సహా 30మందిపై కేసు

చదళ్ల ఘటనలో పోలీసుల విధులకు అడ్డుపడ్డారంటూ బీసీవైపీ అధినేత బి.రామచంద్రయాదవ్‌తోపాటు 30 మందిపై సీఐ రాఘవరెడ్డి కేసు నమోదు చేశారు. పుంగనూరు హెడ్‌కానిస్టేబుల్ ఎ.సుబ్రహ్మణ్యం స్పెషల్ రిపోర్టు మేరకు.. చదళ్ల సభ వద్ద 30 పోలీస్‌యాక్టు ఉందని, అందరూ వెళ్లిపోవాలని సూచించగా రామచంద్రయాదవ్, బీసీవైపీ నాయకులు అనిల్‌కుమార్‌రెడ్డి, భానుప్రకాష్, నవీన్, సుబ్రహ్మణ్యంరెడ్డి, బక్షు, వెంకటేశ్, రమేశ్ యాదవ్, హరిబాబు, సత్యనారాయణ, సురేంద్ర తదితరులపై ఐపీసీ 143, 353, 506 రెడ్‌విత్ 149 సెక్షన్లతో పోలీసులు కేసు నమోదు చేశారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

47 మద్యం బాటిళ్ల స్వాధీనం

తడ, జనవరి 13: అక్రమంగా రవాణా చేస్తున్న 47 బాటిళ్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. భీములవారిపాళెం పోలీస్ చెక్‌పోస్టు వద్ద శుక్రవారం రాత్రి పోలీసులు వాహనాలను తనిఖీ చేపట్టారు. ఆ సమయంలో ఓ వ్యక్తి గోనె సంచితో వెళ్తుండడాన్ని గుర్తించి తనిఖీ చేశారు. అందులో 47 బాటిళ్ల మద్యం ఉండటాన్ని గుర్తించి స్వాధీనం చేసుకుని అతనిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు చిట్టమూరు మండలం చిల్లమూరు గ్రామానికి చెందిన సుబ్బయ్యగా గుర్తించి కేసు నమోదు చేశారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు

ఓజిలి, జనవరి 13: సంక్రాంతి, భోగి పండుగలను పురస్కరించుకుని కోడి పందేలు, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ ఆదిలక్ష్మి హెచ్చరించారు.

ధనుర్మాస పూజలు

కోట, జనవరి 13: మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో శనివారం ధనుర్మాస పూజలు జరిగాయి. గూడలిలోని జనార్ధనస్వామి ఆలయంలో ప్రధానార్చకుడు ఉదయగిరి ఆదిశేషాచార్యులు ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు చేసి విశేషంగా అలంకరించారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో భజనలు చేశారు. అదేవిధంగా గోవిందపల్లిలోని వెంకటేశ్వరస్వామి, నెల్లూరుపల్లి కొత్తపాళెంలోని ప్రసన్నవెంకటేశ్వరస్వామి, శ్రీలక్ష్మమ్మకాలనీలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో ధనుర్మాస పూజలు, భక్తుల భజనలు జరిగాయి. దాతల సహకారంతో అన్నదానం జరిగింది.

గూడూరు నుంచి వెంకటగిరి రావాలంటే

ఒకటిన్నర గంట పడుతోంది

వైసీపీ పాలనపై సోమిరెడ్డి ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి

వెంకటగిరి, జనవరి 13: గూడూరు నుంచి వెంకటగిరి రావాలంటే ఒకటిన్నర గంట సమయం పడుతోందంటే ఈ ప్రభుత్వం బతికున్నట్లా చచ్చిపోయినట్లా అని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి ప్రశ్నించారు. శనివారం మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ నివాసంలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కూటమి రాష్ట్రంలో స్వీప్ చేస్తుందని జోష్యం చెప్పారు. దోపిడీకి పర్యాయ పదమైన జగన్ మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును విమర్శించడం దెయ్యాలు వేదాలు వల్లించిన చందంగాఉందన్నారు. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కలయికతో జగన్‌కు ఓటమి భయం పట్టుకుందని, మతిభ్రమించి పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారని అన్నారు. నాలుగున్నరేళ్లలో ల్యాండ్, మైన్, వైన్ నుంచి కనిపించిన ప్రతిదీ దోచేశారని ఆరోపించారు. టీడీపీ,జనసేన ప్రభుత్వం అధికారంలోకి రాగానే వైసీపీ నేతలు తిన్నదంతా కక్కిస్తామని హెచ్చరించారు. ల్యాండ్ టైటిల్ యాక్టు తీసుకు వచ్చింది వైసీపీ నాయకుల కోసమే తప్ప ప్రజలను ఉద్దరించేందుకు కాదన్నారు. ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని తన రాజకీయ చరిత్రలో చూడలేదని ఆవేదన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు గోడ దూకి పరారవుతున్నారంటే జగన్ నాలుగున్నరేళ్ల పాలన ఎలా ఉందో అర్థమవుతుందన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఈ నెల 19వ తేదీ వెంకటగిరిలో నిర్వహించనున్న రా.. కదలిరా.. బహిరంగ సభను కనీవినీ ఎరుగని రీతిలో విజయవంతం చేస్తామన్నారు. ఒకటిన్నర లక్ష మంది జనసమీకరణ చేసే విషయమై తిరుపతి పార్లమెంటు పరిధిలోని ఏడు నియోజకవర్గాల ఇన్‌చార్జులు, ముఖ్య నేతలతో ఆయన సమీక్షించారు. అనంతరం వెంకటగిరి - తిరుపతి రోడ్డు మార్గంలో చంద్రబాబు సభ నిర్వహణకు నిర్ణయించిన స్థలాన్ని నాయకులతో కలిసి సోమిరెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గాల ఇన్‌చార్జులు కురుగొండ్ల రామకృష్ణ, పాశం సునీల్, బొజ్జల సుధీర్‌రెడ్డి, నెలవల సుబ్రహ్మణ్యం, సుగుణమ్మ, హేమలత, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవుల నాయుడు, తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహయాదవ్, ప్రధాన కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి కేవీకే ప్రసాద్ నాయుడు, జనసేన నాయకుడు తోట కృష్ణయ్య, టీడీపీ నాయకులు జన్నిరమణయ్య, పులికొల్లు రాజేశ్వరావు, పోలంరెడ్డి వెంకటరెడ్డి, మన్నారం చెంచయ్య, వలస రాఘవరెడ్డి, డక్కిలి చంద్రారెడ్డి, అవ్వారు సత్యనారాయణ, కాపా శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిరంకుశ, పెత్తందారీ పోకడలపై నిరసన గాలి: నెలవల

నాయుడుపేట టౌన్, జనవరి 13: ముఖ్యమంత్రి జగన్ నిరంకుశ, పెత్తందారి పోకడలను వైసీపీ ఎమ్మెల్యేలే ఎండగడుతున్నారని సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఐడీని అడ్డం పెట్టుకొని అక్రమ కేసులు బనాయిస్తూ, అరాచక పాలన సాగించిన జగన్ వైఖరితో అధికార పార్టీ ఎమ్మెల్యే విసిగిపోయారని, వచ్చే ఎన్నికల్లో ఓటమి తప్పదని గ్రహించిన వారు నిరసన గళం వినిపిస్తున్నారని అన్నారు. వైసీపీలో ఎస్సీలను, బీసీలను చీడపురుగుల్లా చూస్తున్నారని ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారంటే జగన్ వైఖరితో తెలుస్తోందన్నారు. దేశంలో ఇంతటి నేతగాడు ఎవరూ లేరని, 43వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడి, 38 కేసుల్లో నిందితుడైన వ్యక్తి మన సీఎంగా ఉండడం మన దౌర్భాగ్యమన్నారు. ముఖ్యమంత్రి హోదాలో న్యాయస్థానంలో వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకొని తిరుగుతున్న జగన్, 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబునాయుడుపై తప్పుడు కేసులు పెట్టి అక్రమంగా జైలుకు పంపడం దుర్మార్గమన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం వచ్చే ఎన్నికల్లో టీడీని గెలిపించి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో అవధానం సుధీర్, మొండెం బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, సుజాతమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అధికారుల గైర్హాజరుపై సభ్యుల ఆగ్రహం

వాకాడు, జనవరి 13: మండల కేంద్రంలో స్త్రీశక్తి భవనంలో శనివారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి అధికారులు పెద్ద సంఖ్యలో గైర్హాజరుకావడంతో ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి రాని అధికారులపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయాలని తీర్మానం చేశారు. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ కారికేటి నిర్మల మాట్లాడుతూ ఇటీవల సంభవించిన తుఫాన్‌తో రోడ్లు, విద్యుత్ స్తంబబలు బాగా దెబ్బతిని ప్రజలు ఇబ్బందులు పడుతున్నా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టలేదని ఆయాశాఖల అధికారులను నిలదీశారు. సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ సచివాలయాల్లో వీఆర్వోలు అందుబాటులో ఉండటం లేదని ఫిర్యాదు చేశారు. తహసీల్దారు నరసింహరావు, ఎంపీడీవో గోపీనాథ్, భక్తవత్సల్‌రెడ్డి, అజిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గెలుపు కాదు... క్రీడా స్ఫూర్తి ముఖ్యం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న గాలి భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, జనవరి 13: క్రీడల్లో గెలుపు ముఖ్యం కాదని స్ఫూర్తి ముఖ్యమని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ అన్నారు. శనివారం పట్టణంలోని చర్చి కాంపౌండ్‌లో తెలుగు యువత రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్ ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరక, మానసిక ఆరోగ్యానికి యువత క్రీడల్లో పాల్గొనాలని సూచించారు. 26 జట్లు పాల్గొంటున్న పోటీల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.6 వేలు, తృతీయ బహుమతి రూ.3 వేలు అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, పట్టణ పార్టీ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, పట్టణ బీసీ సెల్ అధ్యక్షుడు సీఎం శరవణ, క్రీడల నిర్వాహకులు డి.శ్రీనివాసులు, రూపేంద్ర నాయకులు లక్ష్మణాచారి, భాస్కర్ అన్ను, ఈశ్వరయాదవ్, గోపినాథ్, హేమాద్రి, రఫీ, హమీద్ బాషా, సాయి, దేవా చైతు, మోహన్, యుగు, నవీన్, నాని తదితరులు పాల్గొన్నారు.

ఎంఈవో హెన్రీ భాస్కర్‌కు పరామర్శ

పుత్తూరు రిటైర్డ్ ఎంఈవో, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, గుడ్‌షెపర్డ్ సేవా సంస్థ అధ్యక్షుడు హెన్రీ భాస్కర్‌ను గాలి భానుప్రకాష్ పరామర్శించారు. శనివారం ఆయన వెళ్లి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పరిస్థితిని వాకబు చేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

నారాయణవనం, జనవరి13: మండలంలోని కశింమిట్ట గ్రామానికి చెందిన గుణశేఖర్ కుమార్తె చాందిని డిసెంబర్ 13న గ్యాస్ సిలిండర్ పేలిన ప్రమాదంలో చనిపోయింది. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.3 లక్షల చెక్కును చాందిని తండ్రికి సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం శనివారం అందజేశారు. ఎంపీపీ దివాకర్ రెడ్డి, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి గ్రామోత్సవం



వడమాలపేట, జనవరి 13: అప్పలాయగుంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం శ్రీవారి గ్రామోత్సవం, ఊంజలసేవ వైభవంగా నిర్వహించారు. వేకువజామున తిరుప్పావై పాశురాలు పటిస్తూ స్వామివారిని మేల్కొలిపి ధనుర్మాస కైంకర్యాలు చేపట్టారు. సాయంత్రం ఉభయనాంచారులతో స్వామివారిని సర్వాభరణాలు, పూలమాలలతో ఊయలలో అలంకరించి వేదమంత్రాలు, భక్తులు గోవిందనామ స్మరణల నడుమ ఊంజల సేవ నిర్వహించారు. అనంతరం సర్వాలంకార భూషితుడైన పద్మావతీ అండాల్ సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామి వారిని మేళతాలలు, మంగళ వాయిద్యాల నడుమ మాడ వీధుల్లో ఊరేగించారు. భక్తులు నారికేల, కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

చెరకు పంట దగ్ధం

పుత్తూరు అర్బన్, జనవరి 13: మున్సిపల్ పరిధిలోని నందిమంగళం వద్ద తొమ్మిది ఎకరాల్లో చెరకు పంట దగ్ధమైంది. రైతులు గోపి, లక్ష్మి, చిట్టిబాబు, రవి, రమేష్‌కు సుమారు తొమ్మిది ఎకరాల్లో చెరకు సాగు చేస్తున్నారు. కోత సిద్ధమవుతున్న క్రమంలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో చెరుకు తోటలో మంటలు చెలరేగాయి. స్థానికులు గుర్తించి అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి మంటలను అదుపుచేశారు. అయితే అప్పటికే పంట పూర్తిగా దగ్ధమైంది. సుమారు రూ.3 లక్షలు నష్టం వాటిల్లినట్లు రైతులు వాపోయారు.

వడ్డీ అడిగిందని కడతేర్చారు

- హత్య కేసు మిస్టరీ ఛేధించిన పోలీసులు
- బంధువులే నిందితులు





మృతురాలు శ్రీదేవి (ఫైల్‌ఫొటో) - నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

పుత్తూరు అర్బన్, జనవరి 13: తీసుకున్న అప్పుకు వడ్డీ చెల్లించాలని ఒత్తిడి చేయడంతో సొంత అత్తనే కడతేర్చారు. గత నెల 22న పుత్తూరు పట్టణ శివారుల్లోని కళ్యాణపురం వద్ద జరిగిన శ్రీదేవి(49) హత్య కేసును పోలీసులు ఛేదించారు. సొంత బంధువులే నిందితులుగా గుర్తించారు. శనివారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కేసుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు విలేకరులకు వెల్లడించారు. తమిళనాడు రాష్ట్రం తిరుత్తణి తాలూకా కొండాపురం గ్రామానికి చెందిన బాలయ్య కుమారుడు చిరంజీవి(31) తన భార్యకు పెద్దనాన్న అయిన పుత్తూరుకు చెందిన గోపి, శ్రీదేవి దంపతుల వద్ద కొంత కాలం క్రితం రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. గత ఏడాది నుంచి వడ్డీ సక్రమంగా చెల్లించడం లేదు. దీనిపై వరుసకు అత్త అయిన శ్రీదేవి పలుమార్లు చిరంజీవిని వత్తిడి చేసింది. గత నెల డిసెంబర్ 14న కొండాపురంలో జరిగిన శుభకార్యానికి శ్రీదేవి తన భర్త గోపి, కుమార్తె ప్రియాంకతో కలిసి వెళ్లింది. వడ్డీ సక్రమంగా చెల్లించని విషయమై బంధువుల ముందు శ్రీదేవి కఠినంగా మాట్లాడడంతో చిరంజీవి అవమాన భారంతో కుంగిపోయాడు. ఈ విషయాన్ని తన అన్న లోకేష్(39)తో చెప్పి బాధపడ్డాడు. బంధువుల ముందు అవమానించిన శ్రీదేవిని అంతమొందించాలని నిర్ణయించుకున్నారు. శ్రీదేవి భర్త గోపి తిరుమలలో వ్యాపారం చేసుకుంటూ వారానికి ఒకసారి ఇంటికి వచ్చేవాడు. కుమారుడు సాయి బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసుకుంటుండగా, కుమార్తె ప్రియాంక వివాహమై చెన్నైలో కాపురం ఉంటోంది. శ్రీదేవి ఇంట్లో ఒంటరిగా ఉంటుండడంతో హత్య చేయాలని అన్నదమ్ములు ఇద్దరు పథకం వేశారు. డిసెంబర్ 22వ తేదీ సొంత గ్రామం కొండాపురం నుంచి ద్విచక్ర వాహనంపై బయలుదేరిన చిరంజీవి, షోలింగర్‌లోని ఒక మెకానిక్ షాపులో ఇనుప రాడ్‌ను తీసుకుని తన అన్న లోకేష్‌తో కలిసి పుత్తూరుకు ఉదయం 9.30 గంటలకు చేరుకున్నాడు. ఇంటికి వెళ్లి శ్రీదేవితో అప్పు విషయమై మాటలు కలిపాడు. వెనుక వైపు నిలబడి ఉన్న లోకేష్ తన వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్‌తో శ్రీదేవి తలపై బలంగా రెండుసార్లు మోదాడు. ఆత్మహత్యగా నమ్మించేందుకు మృతి చెందిన శ్రీదేవి మెడకు చీర బిగించి ఉరి వేసుకున్నట్లు వేలాడదీశాడు. అలాగే దొంగలపై అనుమానం రావాలని మృతురాలి మెడలో బంగారు గొలుసు, బీరువా తెరిచి అందులో వస్తువులు చిందరవందర చేశారు. హత్య అనంతరం ఇంటికి తాళం వేసి వెళ్లారు. అదేరోజు రాత్రి కుటుంబసభ్యులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించగా పుత్తూరు సీఐ లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు.

పోలీసులకు చాలెంజ్‌గా మారిన కేసు

శ్రీదేవి హత్య కేసు పోలీసులకు చాలెంజ్‌గా మారింది. నేరస్తులకు సంబంధించి ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో తొలుత దొంగల పనిగా భావించి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులకు ఎలాంటి క్లూ లభించలేదు. మృతిరాలి మెడలో బంగారం దొంగతనం జరిగిందే తప్ప ఇంట్లోని బీరువాలో ఇతర వస్తువులు, ధనం జోలికి వెళ్లకపోవడంతో దోపిడీ దొంగల పనికాదనే నిర్ధారణకు వచ్చారు. దర్యాప్తు కోణాన్ని ఆర్థిక లావాదేవీల వైపు మళ్లించారు. మృతి చెందిన శ్రీదేవి తెలిసిన వ్యక్తులను మాత్రమే ఇంటి లోపలికి అనుమతిచ్చేదని తెలుసుకున్న పోలీసులు కుటుంబసభ్యులు, బంధువులు, స్నేహితులతో అనుమానితుల జాబితా రూపొందించుకున్నారు. శ్రీదేవి మృతి చెందిన రోజు చివరగా ఉదయం 9.30 గంటలకు ఫోన్‌లో మాట్లాడింది. ఆ తరువాత మధ్యాహ్నం 12.30 గంటలకు భర్త గోపి ఫోన్ చేస్తే తీయలేదు. దీంతో శ్రీదేవి హత్య ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల మధ్య జరిగి ఉంటుందని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. ఆ సమయంలో అనుమానితులు ఎక్కడ ఉన్నారని ఆరా తీయగా చిరంజీవి మొబైల్ ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉన్నట్లు గుర్తించారు. దీంతో చిరంజీవిని ఆరా తీయగా తప్పుడు సమాచారం ఇచ్చాడు. దీనిపై క్రాస్ చెక్ చేసిన పోలీసులు చిరంజీవి చెప్పిన మేరకు ఆ సమయంలో అక్కడ లేడని తెలిసింది. దీంతో పోలీసులు ప్రశ్నించగా చిరంజీవి నేరం అంగీకరించాడు. హత్యకు చేసిన తీరును చిరంజీవి, అతని అన్న లోకేష్ ఇరువురూ పోలీసుల ఎదుట ఒప్పుకున్నారు. సంచలనాత్మక హత్య కేసును ఛేధించిన దర్యాప్తు బృందంలోని ఎస్ఐ వెంకటమోహన్, ఏఎస్ఐ భక్తవత్సలరాజు, సిబ్బంది దామోదర్ తదితరులకు డీఎస్పీ శ్రీనివాసరావు అభినందించడంతో పాటు నగదు రివార్డును అందించారు.





చెంగారెడ్డిని సన్మానిస్తున్న రోజా దంపతులు, గాలి భానుప్రకాష్

చెంగారెడ్డికి పలువురి శుభాకాంక్షలు

నగరి, జనవరి 13: మాజీమంత్రి రెడ్డివారి చెంగారెడ్డి 91వ జన్మదిన వేడుకలు శనివారం సాయిబాబా గుడి ఆవరణలో జరిగాయి. మంత్రి రోజా, నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్, శ్రీశైలం ట్రస్టుబోర్డు ఛైర్మన్ చక్రపాణిరెడ్డి, ఈడిగ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ కేజే శాంతి, నగరి మున్సిపల్ మాజీ ఛైర్మన్ కేజే కుమార్, పుత్తూరుకు చెందిన అమ్ములు అలియాస్ ఏలుమలై, వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి, బీజేపీ నాయకుడు చిలకం ఈశ్వరప్రసాద రెడ్డి తదితరులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

సంక్రాంతి నుంచి ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు

సప్తగిరి గ్రామీణ బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్



ఏఎస్ఎన్ ప్రసాద్

చిత్తూరు కలెక్టరేట్, జనవరి 13: సంక్రాంతి పండుగ నుంచి ఖాతాదారుల సౌకర్యార్థం సప్తగిరి గ్రామీణ బ్యాంకులో మొబైల్ బ్యాంకింగ్, నెట్ బ్యాంకింగ్, యూపీఐ సౌకర్యాలతో కూడిన ఆన్‌లైన్ బ్యాంకింగ్ సేవలు ప్రారంభిస్తున్నట్లు బ్యాంకు ఛైర్మన్ ఏఎస్ఎన్ ప్రసాద్ తెలిపారు. శనివారం చిత్తూరులో ఆయన విలేఖరులతో మాట్లాడుతూ డిపాజిట్లపై ఇతర బ్యాంకుల కంటే 3.5శాతం అత్యధిక వడ్డీ ఇస్తున్నట్లు వివరించారు. 2022-23 ఆర్థికసంవత్సరంలో సప్తగిరి గ్రామీణ బ్యాంకు వ్యాపార లావాదేవీలు రూ.2243 కోట్ల దాకా పెరిగినట్లు చెప్పారు.ఆరు జిల్లాల్లో 240 శాఖలతో నడుస్తున్న సప్తగిరి గ్రామీణ బ్యాంకు శాఖలను త్వరలో మరో 10చోట్ల ప్రారంభిస్తామని తెలిపారు. డిపాజిట్లపై 1-2 సంవత్సరాల వరకు సాధారణ ఖాతాదారులకు 7.50శాతం, 60ఏళ్ళు పైబడిన సీనియర్ సిటిజన్లకు 8శాతం వడ్డీ, 2-3 సంవత్సరాల వరకు 7.75 శాతం, సీనియర్ సిటిజన్లకు 8.25 శాతం అందిస్తామన్నారు. దీనబంధు పథకం కింద బంగారు నగల రుణాలు, ఎస్సీ, బీసీ ఖాతాదారులకు తక్కువ వడ్డీతో బంగారుపై రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. చిన్న తరహా బ్యాంకుల్లో అతి తక్కువ నిరర్థక ఆస్తులు కల్గిన బ్యాంకుగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు గుర్తింపు పొందిందన్నారు. తమ బ్యాంకులో ట్యాక్స్ సేవర్ డిపాజిట్ అందుబాటులో ఉందని, దీని ద్వారా ఖాతాదారులు 80-సి రాయితీ పొందవచ్చన్నారు. తమ బ్యాంకులో నిల్వ చేసిన బ్యాంకు ఖాతాదారుల సొమ్ముకు డీఐసీజీసీ ఇన్సూరెన్స్ వర్తిస్తుందన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.26 కోట్లు

తిరుమల, జనవరి13(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.26 కోట్లు లభించింది. గురువారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శుక్రవారం లెక్కించి శనివారం ఉదయం ప్రకటించింది. ఇక, శుక్రవారం 56,588 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 16,754 మంది తలనీలాలు సమర్పించారు.

చెరువుల్లోకి చేప పిల్లల విడుదల

పుత్తూరు అర్బన్, జనవరి 13: మండల పరిధిలోని చెరువుల్లోకి మత్స్యశాఖ అధికారులు చేప పిల్లలను విడుదల చేశారు. శనివారం కేబీఆర్‌పురం, ఈశ్వరాపురం, గోపాలకృష్ణాపురం, వీరప్పరెడ్డి పాళెం, చిన్నరాజుకుప్పం, నందిమంగళం చెరువుల్లో సుమారు 1.36 లక్షల చేప పిల్లలను విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వెంకటరమణ మాట్లాడుతూ ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన స్కీం (పీఎంఎంఎస్) కింద పుత్తూరు బెస్త మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేప పిల్లల పెంపకాన్ని చేపడుతున్నట్లు చెప్పారు. చేప పిల్లల సంరక్షణకు అన్ని విధాలుగా సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారులు సునీల్‌కుమార్, హేమంత్, సహకార సంఘం అధ్యక్షుడు హేమంతకుమార్, సభ్యులు రామచంద్రయ్య, బాలాజీ, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసులు, గోపి, ఉదయ్‌శంకర్, భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి జీవితం స్ఫూర్తిదాయకం



వివేకానంద చిత్ర పటానికి నివాలర్పిస్తున్న యువజన సేవా సంఘ సభ్యులు

వడమాలపేట, జనవరి 13: స్వామి వివేకానంద జీవితం యువతకు స్ఫూర్తిదాయకమని నెహ్రూ యువజన సేవాసంఘం అధ్యక్షురాలు జ్యోతిలక్ష్మి పేర్కొన్నారు. శనివారం వడమాలపేట మండలం, ఎస్వీ పురం గ్రామంలో నెహ్రూ యువజన వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులుఅర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర యువజన అవార్డు గ్రహీత వెంకమరాజు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొని గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నెహ్రూ యువజన సేవా సంఘం సభ్యులు కేబీ సుబ్రహ్మణ్యం రాజు, నాదముని, మురళి, లోకేష్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

జల్లికట్టు, కోడిపందేలకు అనుమతిలేదు: ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), జనవరి 13: జల్లికట్టు, కోడి పందేలు, పేకాట ఆడటం చట్ట వ్యతిరేకమని, సంక్రాంతి పండుగ సందర్భంగా వాటికి దూరంగా ఉండాలని ఎస్పీ పరమేశ్వరరెడ్డి అన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. గ్రామాల్లో అలాంటివి నిర్వహిస్తే 8099999977కు సమాచారం అందించాలని కోరారు. పండుగకు స్వస్థలాలకు వెళ్లే అవకాశం ఉన్నందున దొంగతనాలు జరిగే అవకాశాలున్నాయని, అలాంటి వారు ఇళ్లలో విలువైన బంగారు, వెండి నగలు, నగదు ఉంచరాదని సూచించారు.

సీఎం జగన్‌కు బుద్ధి చెప్పడం ఖాయం



33 అంకె ఆకారంలో కూర్చుని అంగన్వాడీల నిరసన

పుత్తూరు అర్బన్, జనవరి 13: రానున్న ఎన్నికల్లో సీఎం జగన్‌కు అంగన్వాడీలు బుద్ధి చెప్పడం ఖాయమని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేష్ స్పష్టం చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో 33 రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో అంగన్వాడీలు 33 అంకె వచ్చే విధంగా కూర్చుని నిరశన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలరోజులకు పైగా అంగన్వాడీలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. ఇప్పటికి ఏడుసార్లు చర్చలకు పిలిచిన ప్రభుత్వం ప్రధాన డిమాండైన వేతనాల పెంపు అంశంపై మాత్రం ఎలాంటి హామీ ఇవ్వకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి పండుగల వేళ అంగన్వాడీల డిమాండ్లను వెంటనే నెరవేర్చాలని చెప్పారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల అందజేత



ట్యాబ్‌లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

వడమాలపేట, జనవరి 13: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో ఎనిమిదవ తరగతి విద్యార్థులకు తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ ధనంజయులు ట్యాబ్‌లు అందజేశారు. శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానంతో డిజిటల్ విద్యాబోధనే లక్ష్యంగా ప్రభుత్వం విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేసిందని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

శ్రీరామ నామం మహిమాన్వితం

శ్రీకాళహస్తి జనవరి 13: శ్రీరామ నామం ఎంతో మహిమాన్వితమని శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. అయోధ్య నుంచి విచ్చేసిన శ్రీరామ పూజిత అక్షింతలను విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో ఇంటింటికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ కోలా ఆనంద్, కావిరాల శ్రీనివాసులు జెట్టి, గరికపాటి రమేష్ బాబు కంటా ఉదయ్ పాల్గొన్నారు.

ఏర్పేడు: ఏర్పేడు రామాలయం వద్ద అయోధ్య అక్షింతలను అక్షింతల కమిటీ కన్వీనర్ శంకర్‌రెడ్డి, ఎస్ఎస్ఎఫ్ మండల కన్వీనర్ కాటయ్య సర్పంచుల సంఘం అధ్యక్షుడు నల్లపాళెం శివయ్యకు అందించారు.

ముక్కంటి సేవలో మంచు విష్ణు



శ్రీకాళహస్తి, జనవరి 13:శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని శనివారం హీరో మంచి విష్ణు దర్శించుకున్నారు. భక్తకన్నప్ప చిత్రాన్ని హీరో విష్ణు నటిస్తున్న విషయం తెలిసిందే. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ వారికి ఘన స్వాగతం పలికారు. ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో వేద పండితులు శేష వస్త్రంతో సత్కరించి ఆశీర్వచనం ఇచ్చారు.

ముస్లిం యువతి వివాహానికి ఆర్థికసాయం



శ్రీకాళహస్తి జనవరి 13: పట్టణంలోని 22వ వార్డుకు చెందిన షేక్ బాబు, హసీనా దంపతుల కుమార్తె వివాహానికి బొజ్జల కుటుంబం ఆర్థిక సాయం అందించింది. బొజ్జల రిషితారెడ్డి అందించిన రూ.10వేల నగదును ఆ వార్డు ఇన్‌చార్జి బుజ్జి వారికి అందజేశారు. టీడీపీ నాయకులు శేఖర్, బాలయ్య అనూష, సులేమాన్, శివకుమార్ పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన అడిషనల్ డీజీపీ



ఏడీజీపీ దంపతులకు స్వాగతం పలుకుతున్న శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, జనవరి 13: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీస్ విభాగం అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (ఏడీజీపీ), రాష్ట్ర స్థాయి పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు చైర్మన్ అతుల్‌సింగ్ (ఐపీఎస్) శనివారం శ్రీసిటీని సందర్శించారు. ఆయన భార్య ప్రఖ్యాత ఆర్కిటెక్ట్, ఇంటీరియర్ డిజైనర్ ప్రియా సింగ్ కూడా ఈ సందర్శనలో పాల్గొన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డా. రవీంద్ర సన్నారెడ్డి వీరికి స్వాగతం పలికి, శ్రీసిటీ మౌలిక సదుపాయాలు, పారిశ్రామిక ప్రగతి, ప్రత్యేకతలు, ఇక్కడ భద్రతా వ్యవస్థ గురించి వారికి వివరించారు. తమ పర్యటనలో వారు క్రియా విశ్వ విద్యాలయం, రాక్‌వర్త్, ఎవర్టన్, హంటర్ డగ్లస్ పరిశ్రమలను సందర్శించారు.

మాజీ మంత్రి అమర్‌ను కలిసిన దశరథ వాసు



పిచ్చాటూరు, జన వరి 13: మాజీ మంత్రి అమర్‌నాథ్ రెడ్డిని టీడీపీ ఎస్సీసెల్‌రాష్ట్ర ఉపాధ్య క్షుడు దశరథ వాసు శనివారం పలమ నేరులోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువతో సన్మానించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలియజేశారు.

భారీ కోడి పందేలకు సన్నాహాలు

శ్రీకాళహస్తి, జనవరి 13: శ్రీకాళహస్తి పరిధిలో భారీగా కోడి పందేలు నిర్వహించేందుకు జూదరులు సన్నాహాలు చేసుకున్నట్లు సమాచారం. అడ్డుకునే వారే ఉండరంటూ కొందరు బాహాటంగా చర్చించుకుంటున్నారు. శ్రీకాళహస్తిలోని ఎన్టీఆర్ నగర్, ఇదే మండలంలోని రామాపురం, మన్నవరం, వెంకటగిరి సరిహద్దు గ్రామాల్లో, అలాగే తొట్టంబేడు మండలం గద్దగుంట వద్ద భారీ ఎత్తున కోడి పందేలు ఆదివారం ఉదయం నుంచే నిర్వహించేందుకు కొందరు సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం.

ఇంటిపట్టాల పంపిణీ

శ్రీకాళహస్తి, జనవరి 13: పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో శనివారం తొట్టంబేడు మండలం కాసరం ఎస్టీ కాలనీ చెందిన 11 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె పవిత్ర రెడ్డి ఇంటి పట్టాలను పంపిణీ చేశారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

వరదయ్యపాళెం, జనవరి 13: వరదయ్యపాళెం మండలం వీకేఆర్‌పై కాలనీలో శనివారం రెవెన్యూ అధికారులు ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇటీవల ఇక్కడి ఆక్రమణలపై వార్తా పత్రికల్లో వరుస కథనాలు రావడంతో స్పందించిన తహసీల్దారు గౌరీశంకర్‌రావు ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది ఆక్రమిత పొలాలను, ఖాళీ స్థలాలను సర్వేచేసి బోర్డులను ఏర్పాటు చేశారు.

శ్రీసిటీలో సంక్రాంతి సంబరాలు

శ్రీసిటీ, జనవరి 13: శ్రీసిటీలో ముందస్తు సంక్రాంతి సంబరాలు వేడుకగా జరిగాయి. శ్రీసిటీ ఆధ్యాత్మిక సాహిత్య వేదిక శ్రీవాణి ఆధ్వర్యంలో స్థానిక ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం ముగ్గుల పోటీలు, కోలాటం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనేందుకు శ్రీసిటీలోని వివిధ విభాగాలకు చెందిన మహిళా ఉద్యోగులు, పరిసర గ్రామాల మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు. మరోవైపు ఆరూరు గ్రామస్తులు కోలాట నృత్యాలతో అలరించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, శ్రీసిటీ డైరెక్టర్ సుధాకర్‌రెడ్డి, ముఖ్య అతిథులుగా విచ్చేసిన అడిషనల్ డీజీపీ అతుల్‌సింగ్, ఆయన భార్య ప్రియాసింగ్ స్వామిని దర్శించుకున్నారు. ముగ్గుల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, విజేతలుగా నిలిచిన కీర్తన, నిషా, పూర్ణిమ, ముఖ్య అతిథి శ్రీమతి ప్రియాసింగ్ నుంచి నగదు బహుమతులు అందుకున్నారు.

షికారీలకు నిత్యావసర సరుకుల పంపిణీ

ఏర్పేడు, జనవరి 13: ఏర్పేడు మండలంలోని నచ్చనేరి, చిందేపల్లి, రాజులపాళెం, మర్రిపురం గిరిజనకాలనీల్లో ఉన్న షికారీలకు ప్రజాసాధికార సమితి ఆధ్వర్యంలో గుంజుస్ సంస్థ సహకారంతో శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సంస్థ కార్యదర్శి దేవేంద్రకుమార్, సర్పంచులు పెంచలయ్య, మునిరామయ్య, నాయకులు సిద్ధయ్య, ఈశ్వరయ్య, రంగయ్య పాల్గొన్నారు.

కారును ఢీకొన్న లారీ .. తప్పిన ప్రమాదం

ఏర్పేడు, జనవరి 13: ఏర్పేడు మండలం అముదూరు క్రాస్ వద్ద వెంకటగిరి నుంచి తిరుపతి వైపు వస్తున్న కారును లారీ ఢీకొంది. కారు ముందుభాగం దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. కారు డ్రైవర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడు మద్యం సీసాల స్వాధీనం

ఏర్పేడు, జనవరి 13: ఏర్పేడు మండలం రాజులపాళెం గిరిజన కాలనీలో అక్రమంగా అమ్ముతుఉన్న ఏడు మద్యం సీసాలను ఎస్ఐ జిలానీ శనివారం స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పండుగ సందడి

- కిక్కిరిసిన శ్రీకాళహస్తి
- కొనుగోలుదారులతోకిటికిటలాడిన దుకాణాలు

శ్రీకాళహస్తి, జనవరి 13: శ్రీకాళహస్తిలో శనివారం పండుగ సందడి నెలకొంది. కొనుగోలు దారులతో దుకాణాలు కిటకిటలాడాయి. పండుగల్లోనే పెద్ద పండుగ సంక్రాంతి అన్న విషయం తెలిసిందే. ఆదివారం పండుగ కావడంతో ఒక రోజు ముందుగా శనివారం పండుగ అవసరాలకు సరుకులు కొనుగోలు చేసేందుకు పెద్ద ఎత్తున ప్రజలు బజారుకు విచ్చేశారు. పట్టణ వాసులతోపాటు పరిసర వందలాది గ్రామాల ప్రజలు పట్టణానికి పోటెత్తారు. వీధులన్నీ వాహనాల రద్దీ, శబ్దంతో మోతమోగాయి. కొత్త దుస్తులు కొనుగోలు చేసేందుకు ఎగబడ్డారు. రోడ్లు, తోపుడు బండ్లపై నిర్వహించే చిరు వ్యాపారాలు దగ్గర నుంచి పెద్ద పెద్ద వస్త్ర దుకాణాలు వద్ద కొనుగోలుదారులుతో కిటకిటలాడాయి. నిత్యవసర సరుకుల దుకాణాల్లో సైతం రద్దీ కనిపించింది. సాయంత్రం 5గంటల నుంచి రద్దీ ఎక్కువైంది. 10 గంటల వరు కొనసాగింది. పట్టణంలో ఎక్కడ చూసినా ట్రాఫిక్ సమస్య తప్పలేదు.

కోళ్లకు గిరాకీ..

సంక్రాంతి అంటేనే మాంసం ప్రియులకు నోరూరిపోతుంది. ముఖ్యంగా భోగి పండుగ, కనుమ పండుగ రోజున ముక్క ఉండాల్సిందే. ఈ ఏడాది భోగి ఆదివారం, కనుమ పండుగ మంగళవారం వచ్చాయి. దీంతో కోళ్ల విక్రయాలు జోరుగా సాగాయి. బ్రాయిలర్, లింగాపురం కోళ్లను కొనుగోలు చేశారు.





ఓ వస్త్ర దుకాణం వద్ద రద్దీ, కోళ్లు బేరం చేస్తున్న మహిళలు

ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలి

- టీడీపీ, జనసేనా, బీజేపీ రాస్తారోకో



నందనంలో రాస్తారోకో చేస్తున్న టీడీపీ, జనసేన నాయకులు

నాగలాపురం, జనవరి 13: నాగలాపురం మండల పరిధిలోని సుబ్బానాయుడు కండ్రిగ గ్రామంలో అక్రమంగా నిర్వహిస్తున్న ఇసుక రీచ్‌ను రద్దు చేయాలంటూ టీడీపీ, జనసేనా, బీజేపీ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. శనివారం సత్యవేడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ హెలెన్, జనసేన మండలాధ్యక్షుడు మణికంఠన్, బీజేపీ నాయకులు కలిసి ఇసుక అక్రమ రవాణా రద్దు చేయాలని నందనం గ్రామం వద్ద తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై బైఠాయించారు. అనుమతులు లేని ఇసుక రీచ్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా హెలెన్ మాట్లాడుతూ న్యాయస్థానాల ఆదేశాలను లెక్క చేయకుండా ఇసుక రవాణాతో వేలాది కోట్ల రూపాయలను దోచుకునే ఘనత వైసీపీకే సాధ్యమని విమర్శించారు. సుమారు గంట సేపు జాతీయ రహదారిపై రాస్తా రోకో నిర్వహించడంతో ఎక్కడి వాహనాలు అక్కడే ఆగిపోయాయి. విషయం తెలుసుకున్న నాగలాపురం హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆందోళన కారులతో చర్చించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, జనసేన నాయకులు హేమకుమార్ శ్రీనివాసులు, చంద్రశేఖర్, రాజేంద్ర, దేవప్రశాంత్, బీజేపీ నాయకులు మణి నాయుడు, సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనసేన ముగ్గుల పోటీలకు విశేష స్పందన



బహుమతి అందజేస్తున్న వినుత

శ్రీకాళహస్తి జనవరి 13: జనసేన పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీలకు మహిళల నుంచి విశేష స్పందన లభించింది. శ్రీకాళ హస్తి పట్టణ శివారులోని సీసీఎన్ కళ్యాణ మండపం వద్ద శనివారం మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తొట్టంబేడు మండలం పెద్దకన్నలి గ్రామానికి చెందిన దయాని ప్రథమ స్థానంలో నిలిచింది. ఆమెకు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి వినుత బంగారు కమ్మలను బహుమతిగా ప్రదానం చేశారు. రెండవ స్థానంలో నిలిచిన శ్రీకాళహస్తికి చెందిన నారాయణ గాయత్రికి వెండి ఆభరణం, మూడవ స్థానంలో నిలిచిన శ్రీకాళహస్తికి చెందిన స్వరూపాకు మిక్సీ అందజేశారు. జనసేన నాయకులు చంద్రబాబు, శ్రీకాళహస్తి మండల ఇన్‌చార్జి దండి రాఘవయ్య, పట్టణ ఇన్‌చార్జి తోట గణేష్, తొట్టంబేడు మండల ఇన్‌చార్జి చంద్రశేఖర్, ఐటీ కో-ఆర్డినేటర్ శివకుమార్ పాల్గొన్నారు.

రేషన్ వాహనాన్ని అడ్డుకున్న గ్రామస్తులు

వరదయ్యపాళెం, జనవరి 13: యానాదివెట్టు గ్రామంలో శనివారం గ్రామస్తులు ఆర్‌బీకే చైర్మన్ మురళినాయుడు ఆధ్వర్యంలో రేషన్ వాహనాన్ని అడ్డుకున్నారు. బియ్యం మినహా కందిపప్పు, గోధుమపిండి, చక్కెర ఇవ్వకపోవడంపై నిలదీశారు. వాహన నిర్వాహకులు డీలర్‌తో మాట్లాడాలని స్పష్టం చేశారు. దీంతో వారు డీలర్ లతతో మాట్లాడగా వచ్చినవి మాత్రమే ఇచ్చామని లేనివి ఎలా ఇవ్వగలమని ఎదురు ప్రశ్నించారు. పైగా దిక్కున్నచోట చెప్పుకోండి అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చిందని మురళి నాయుడు నిరసన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని సరుకులు సక్రమంగా పంపిణీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీజేపీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా మునికుమార్



నాగలాపురం, జనవరి 13: బీజేపీ మోర్చా సోషల్ మీడియా జిల్లా కన్వీనర్‌గా నాగలా పురానికి చెందిన మునికుమార్ (బాబు) ఎన్నికైనట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షులడు గోపీ ఆచ్చారి తెలిపారు. ఇందుకు సంబంధించిన నియామక పత్రాన్ని శనివారం మునికుమార్‌కు అందించారు.

భోగభాగ్యాల భోగికి సిద్ధం

కేవీబీపురం జనవరి13: మండలంలోని గ్రామీణ ప్రజలు భోగి పండుగకు సిద్ధమయ్యారు. ఇళ్ల ముందు భోగి మంటలు వేసేందుకు కట్టెలు, మొక్కలను సిద్ధం చేసుకున్నారు. ముఖ్యంగా చిన్న పిల్లలు భోగి మంటలు వేసేందుకు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.

సంక్రాంతి... సంప్రదాయ సంపద

శ్రీకాళహస్తి జనవరి 13: సంక్రాంతి పండుగ ఒక సంప్రదాయ సంపదని టీడీపీ శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్‌చార్జి బొజ్జల సుధీర్ రెడ్డి అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద శనివారం రాత్రి టీడీపీ నాయకులు భోగి మంటలు వేసి పండుగ సంబరాలు నిర్వహించారు. టీడీపీ పట్టణ అధ్యక్షుడు విజయ్ కుమార్, పార్లమెంట్ కోశాధికారి కంఠా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ప్రత్యేక హోదా



ప్రచారం చేస్తున్న మాజీ ఎంపీ చింతామోహన్

శ్రీకాళహస్తి, జనవరి 13: కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్రానికి ప్రత్యేక హోదా సాధ్యమని మాజీ ఎంపీ చింతామోహన్ అన్నారు. శ్రీకాళహస్తిలోని పలు ప్రాంతాల్లో చింతా మోహన్ శనివారం కరపత్రాల ద్వారా ఇంటింటికీ ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక విధానాలు అమలుచేతగాక పాలనలో ఘోరంగా విఫలమయాయన్నారు. రాష్ట్రంలో కనీసం పంచాయతీలకు నిధులు లేక దయనీయ పరిస్థితుల్లో ఉన్నాయని పేర్కొన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యగా ఉన్న సీపీఎస్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం పథకాన్ని అమలు చేస్తామని తెలిపారు. కాంగ్రెస్‌తోనే నిరుద్యోగ నిర్మూలన సాధ్యమని వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఘనంగా గొబ్బెమ్మ ఊరేగింపు



శ్రీకాళహస్తి జనవరి 13: గొబ్బెమ్మ ఊరేగింపు శనివారం చతుర్మాడ వీధుల్లో ఘనంగా జరిగింది. ధనుర్మాసం పురస్కరించుకుని ముక్కంటి ఆలయంలోని అలంకార మండపంలో గొబ్బెమ్మ ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించారు. ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఊరేగింపు ప్రారంభించారు. చతుర్మాడ వీధుల్లో అమ్మవారికి భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

విధుల్లో చేరకనే తీర్మానంపై సంతకం.. చేరాక నిధుల స్వాహా

- ఇందిరానగర్ పంచాయతీలో గత కార్యదర్శి చేతివాటం
- ఎలా సాధ్యమని ప్రశ్నిస్తున్న జనం



తీర్మానంలో సంతకాలు చేసి బిల్లు స్వాహాపత్రం, కార్యదర్శి సీలు, సంతకం లేకుండా బిల్లు మంజూరు రశీదు

వరదయ్యపాళెం, జనవరి 13: విధుల్లో చేరకుండా నిధులు డ్రాచేసేందుకు అవసరమైన తీర్మానంపై ఓ కార్యదర్శి సంతకం చేశారు. ఆ తర్వాత విధుల్లో చేరాక నగదు డ్రాచేయడం గమనార్హం. ఇది ఎలా సాధ్యమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వరదయ్య పాళెం మండలంలోని ఇందిరా నగర్ పంచాయతీలో 2022 ఫిబ్ర వరి 2 నుంచి అదే ఏడాది జూలై 6 వరకు ఓ కార్యదర్శి విధులు నిర్వహించారు. ఆ కార్యదర్శి సాధారణ నిధులు రూ.3,55,035 డ్రా చేశారు. ఆ నిధులకు సంబంధించిన ఖర్చు వివరాలు రికార్డుల్లో చూపలేదు. పైగా ఈయన 2021 అక్టోబరు 26న రూ.45,509కు, 2021 డిసెంబరు 27న 71,097లకు తీర్మానం చేశారు. విధుల్లో చేరకుండా తీర్మానంపై సంతకం ఎలా చేశారో అధికారులకే తెలియ జేశారు. అంతేగాక 2022 మార్చి 29న ఎంబుక్ వివరాలు లేకుండా రూ.95,093 సంతకాలు చేశారు. టిన్ నెంబరు బిల్లులు, ఓచర్లు, రశీదులు, నకిలీ బిల్లులతో సెక్రటరీ సంతకాలు చేయ కుండానే డబ్బులు సర్పంచ్ ఖాతాలోకి జమ అయ్యాయని సామాజిక కార్యకర్త ఆశ ఆరో పించారు. అసలు వేరేచోట విధుల్లో ఉన్న కార్యదర్శి ఇలా ఎలా నగదు డ్రా చేయగలరని నిలదీస్తున్నారు. దీనివెనుక ఎవరున్నారో తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. అదేవిధంగా 15వ ఆర్థిక సంఘం నిధులు కింద రూ.1.18లక్షలకు లెక్కలు చూపించలేదని తెలియజేశారు.

రేణిగుంట పంచాయతీకి ఆదాయం అక్కర్లేదా..?!



పంచాయతీ స్థలంలో చిరువ్యాపారులు

రేణిగుంట, జనవరి 13: రేణిగుంట పంచాయతీకి కోట్ల రూపాయల ఆదాయం వచ్చే వనరులు ఉన్నాయి. అయితే పాలక మండలి, అధికారుల నిర్లక్ష్యంతో ఆదాయానికి గండిపడుతోంది. మండలంలోని మేజర్ పంచా యితీల్లో రేణిగుంట అగ్రస్థానంలో ఉంది. ఈ పంచాయితీకి ఏడాదికి రూ.2కోట్లు పైచిలుకు రాబడి ఉంది. రెండేళ్ల పాటు పంచాయితీ ఆస్తుల నుంచి ఆదాయాన్ని పెంచుకోవడానికి టెండర్లు నిర్వహించారు. అయితే పట్టణ నడిబొడ్డున పోస్టాఫీసు కార్యాలయం ఎదుటవున్న ఖాళీస్థలానికి టెండరు పిలువలేదు. గతంలో ఉన్న షాపులకు కాలం చెల్లడంతో వాటిని పడగొట్టారు. అప్పటి నుంచి దుకాణాలు నిర్మించలేదు. అప్పటి నుంచి ఆ స్థలం ఖాళీగా ఉంది. ఖాళీ స్థలాన్ని లీజుకు ఇవ్వవచ్చు. లేదా ఆ స్థలంలో కనీసం మూడు దుకాణాలు ఏర్పాటు చేయవచ్చు. ఒక్కో దుకాణానికి నెలకు రూ.20వేల వరకు అద్దె వస్తుంది. మూడు దుకాణాలకు కలిపి నెలకు రూ.60 వేలు వచ్చే వీలుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.7.20లక్షల ఆదాయం వచ్చే అవకాశం ఉంది. అయితే పాలకులు, అధికారులు పట్టించుకోకపోవడంతో పంచాయతీకి ఆదాయం అక్కర లేదా అని జనం చర్చించుకుంటున్నారు. ఆదాయం వస్తేనే కదా పట్టణం అభివృద్ధి చెందేది అని పేర్కొంటున్నారు. మరి అధికారులు ఆదిశగా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

భోగి మంటల్లో ఎస్మా ప్రతులు

- ప్రభుత్వ నిరంకుశత్వం నశించాలి
- కొనసాగిన అంగన్వాడీల ఆందోళన



శ్రీకాళహస్తిలో అంగన్వాడీల ఆందోళన



సత్యవేడులో అంగన్వాడీల నిరసన

శ్రీకాళహస్తి, జనవరి 13: న్యాయమే అంతిమంగా గెలుస్తుందని అంగన్వాడీలు అన్నారు. పట్టణంలోని ఐసీడీఎస్ కేంద్రం వద్ద 33వ రోజు శనివారం భోగి మంటల్లో ఎస్మా జీవో కాగితాలు కాల్చి నిరవధిక సమ్మెను కొనసాగించారు. తమ ను ఇంత చులకనగా చూస్తున్న ప్రభుత్వానికి తమ ఉసురు తగలక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల నాయకులు భారతి, స్వర్ణ తదితరులు పాల్గొన్నారు.

పిచ్చాటూరు: ఎస్మా జీవో నెం.2 ప్రతులను భోగిమంటల్లో వేసి పిచ్చాటూరులో అంగన్వాడీలు సమ్మె చేపట్టారు. ప్రభుత్వం బెదిరింపులకు దిగడం గర్హనీయమన్నారు. సమస్యలు పరిష్కరించకుంటే మూడునెలల్లో ఇంటికి పంపడం ఖాయమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, అంగన్వాడీ యూనియన్ నాయకులు, ఆయాలు పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడులోనూ అంగన్వాడీలు ఎస్మా ప్రతులను భోగి మంటల్లో వేసి నిరసన తెలియజేశారు. ఎఐటీయూ డివిజన్ కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ తాటాకు చప్పుళ్లకు అంగన్వాడీలు భయపడరని స్పష్టం చేశారు. అధికారంలోకి రాక ముందు ఇచ్చిన హామీలను సీఎం జగన్ నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె ఆపేది లేదని స్పష్టం చేశారు. ఎన్నిరోజులైనా ఆందోళన కొనసాగిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మురళి, అంగన్వాడీ కార్యకర్తలు నిర్మల, భువన, సరళ, శాంతి ఝాన్సీ, కాంతమ్మ, భారతి, నాగరాజు, మంజుల, చందామరి, విజయ, పార్వతి, అనురాధ, సుజాత, బుజ్జమ్మ తదితరులు పాల్గొన్నారు.